
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 29 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	225
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 19.2

విద్యా వ్యవస్థను పరిరక్షించాలి

నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను పరిరక్షించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆరో విద్యా వైజ్ఞానిక మూడు రోజుల మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్య ఉన్న చోటే అభివృద్ధి ఉంటుందని, ఒక కుటుంబంలో ఒక్కరు విద్యావంతులైతే ఆ కుటుంబ సభ్యులందరూ అభివృద్ధి చెందుతారన్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 18.5లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, అనేక కారణాలతో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయన్నా రు. పారిశుధ్య కార్మికులు, కాపలాదారులు లేక ఇబ్బందికరమైన పరిస్థితుల్లో పాఠశాలలు ఉండేవని, ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను నియమించిందన్నారు. నూతన డీఎస్సీ ద్వారా 10 వేలకు పైగా కొత్త ఉపాధ్యాయులు వచ్చారని, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లలో మరో 10వేల మంది నియమితులయ్యారన్నారు. పదోన్నతులు, బదిలీల సమస్య కాంగ్రెస్ హయాంలోనే పరిష్కారమైందన్నారు. 317జీవోలో సమస్యలున్నాయని, డిసెంబరు 31లోపు స్పౌజ్ సమస్యలను... - మిగతా 6వ పేజీలో...



నల్లగొండ జిల్లాకేంద్రంలో యూటీఎఫ్ మహాసభలలో మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ జిల్లాకేంద్రంలో యూటీఎఫ్ మహాసభలలో పాల్గొన్న టీచర్లు



విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలి: కే.శ్రీనివాస్

- మూఢ నమ్మకాలను పెంచే విద్యా విధానం ప్రమాదకరం
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- సమాజంలో పెరుగుతున్న అంతరాలు : కే.నాగేశ్వర్
- నల్లగొండలో ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆరో మహాసభలు

పారిశుధ్యం, తాగునీటిపై పర్యవేక్షించాలి

- కలెక్టర్ ఇలాత్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్యం, తాగునీటిపైన మండల పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పారిశుధ్యం, తాగునీటి అంశాలపై ఎంపీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీరోజు శానిటేషన్, తాగునీటిపై పర్యవేక్షణచేసి ఇబ్బందులు ఉంటే, వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎంపీవోలు విధులకు గైర్హాజరు కావొద్దన్నారు. జనవరి 15లోగా గ్రామపంచాయతీల్లో పన్ను వసూళ్లు పూర్తి చేయాలని, డిసెంబరు 31 నాటికి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పంచాయతీ కార్యదర్శులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మురళీ, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి

నల్లగొండ రూరల్: పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించింది. కలెక్టరేట్‌లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా ఉండాలని, ఈ విషయంలో తహసీల్దార్లదే కీలక పాత్ర అన్నారు. ఇళ్లకు విద్యుత్, తాగునీరు, రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ తిరుపతయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపే లక్ష్యం

- మిషన్ పరివర్తన్ ద్వారా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం
- ఎస్పీ శరత్ చంద్ర పవార్



జిల్లాకేంద్రంలో వార్షిక నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

జిల్లాలో నేరాల అదుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వార్షిక క్రైమ్ ప్రెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఇబ్బందులకు గురి చేసిన విషయంలో ఈ ఏడాది మొత్తం 655 కేసులను నమోదు చేయగా, అందులో వరకట్న వేధింపుల వల్ల మరణాలు 1, ఆత్మహత్య చేసుకునే లా ప్రేరేపించిన కేసులు 10, వేధింపులు 292, స్త్రీల హత్యలు 8, రేప్ కేసులు 97, కిడ్నాప్ 46, వేధింపులకు సంబంధించిన కేసులు 201 ఉన్నాయన్నారు. డ్రగ్ మాఫియాను నిర్మూలించడానికి రాష్ట్ర పోలీసులు డ్రగ్స్‌రహిత తెలంగాణగా మార్చడానికి డ్రగ్ పెడ్లర్లపై 24 గంటలు నిఘా ఉంచడానికి డీవోపీఎమ్ఎస్ యాప్‌ను రూపొందించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది మొత్తం 34 గంజాయి కేసులు నమోదు చేసి 124 మంది నిందితులను గుర్తించామని, సుమారు రూ.2కోట్ల విలువైన 794.69 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ క్రైం)

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు

మననం 2024

గడచిపోతున్న 2024 సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొత్త అభివృద్ధికి పునాదులు పడ్డాయి. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేలా ఇరిగేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మరోవైపు మౌలిక వసరుల కల్పనా రంగానికి శ్రీకారం చుట్టింది. జిల్లాకు చెందిన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ఈ ఏడాదంతా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారంచుట్టారు. ప్రధానంగా ఎస్ఎల్‌బీసీ పూర్తికి కార్యాచరణ ప్రకటించగా, డిండి లిఫ్టు, మూసీ కాల్వలకు భారీగా నిధులు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో సీఎంఇచ్చిన హామీ మేరకు మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును చేపట్టారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల నుంచి నీటిపరవళ్లు

- నెరవేరిన బ్రాహ్మణవెల్లెంల కల, రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసిన సీఎం రేవంత్, మంత్రి వెంకటరెడ్డి
- వెలుగు జిలుగుల యాదాద్రి ప్రారంభం
- నల్లగొండలో మెడికల్ కళాశాల ప్రారంభం, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన
- ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల పథకాలకు డెడ్‌లైన్లు



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు

జిల్లాలోని నకిరేకల్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు సాగునీరిచ్చే ఉదయసముద్రం, బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం కల ఈ ఏడాదిలో సాకారమైంది. ఈ ప్రాజెక్టు పైలాన్‌ని సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్ ఏడో తేదీన ఆవిష్కరించారు. పైలాన్ ఆవిష్కరణతోపాటు బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసిన సీఎం అక్కడ గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఫ్లోరోసిస్‌తో బాధపడే తన సొంత గ్రామంతోపాటు మూడు నియోజకవర్గాల్లోని ప్రజల ఇక్కట్లు తీర్చేందుకు 2007లో అప్పటి ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏఎమ్మార్పీ ద్వారా బ్రాహ్మణవెల్లంలకు నీటిని తీసుకొచ్చి ఇక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి తద్వారా ఇక్కడి నుంచి లక్ష ఎకరాలకు నీరివ్వాలనే పథకానికి రూపకల్పన చేశారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి ఈ పథకానికి రూ.699కోట్ల నిధులు మంజూరు చేయించడమేకాక అప్పటి సీఎం వైఎస్ఆర్‌తో శంకుస్థాపన చేయించారు. 2013 వరకు పనులు వేగంగా సాగినా పథకం పూర్తికాలేదు. అనంతరం గత పదేళ్లలో ఈ పథకం ముందుకు సాగలేదు. గత ఎన్నికలకు ముందు పంపుహౌస్, లిఫ్టుల పనులు పూర్తిచేసి ట్రయల్‌రన్ నిర్వహించినా, రిజర్వాయర్, కాల్వల పనులు అలాగే ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఈ పథకానికి రూ.100కోట్లు కేటాయించి పెండింగ్ పనులు పూర్తిచేయించి ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశారు. లక్ష ఎకరాలకు నిర్దేశించిన బ్రాహ్మణవెల్లంల, ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కింద మొదటి దశలో 48,972 ఎకరాలకు ఈ ఏడాది నీరిచ్చేందుకు నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ పనులను నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల్లో చేపట్టారు. కాల్వల తవ్వకాల పనులు వేగంగా సాగుతున్నాయి.

యాదాద్రి థర్మల్‌పవర్ స్టేషన్ జాతికి అంకితం

నాలుగువేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తోన్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో విద్యుదుత్పాదన ప్రక్రియని ఈ డిసెంబరు ఏడో తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వైటీపీఎస్‌లో తొలిదశలో 800 మెగావాట్ల యూనిట్-2నుంచి విద్యుదుత్పాదన మొదలైంది. మొత్తం అయిదు యూనిట్లుగా చేపట్టిన యాదాద్రి పవర్‌ప్లాంటులో డిసెంబర్‌లో యూనిట్-2 విద్యుదుత్పాదన మొదలవగా, యూనిట్-1 కూడా విద్యుదుత్పాదనకు సిద్ధమైంది. మిగిలిన మూడు యూనిట్లు కూడా దాదాపు 85శాతం పనులు పూర్తయ్యాయి. 8.8 కిలోమీటర్ల రైల్వేలైన్ కూడా ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే ట్రాక్ పర్మిషన్ మంజూరుచేసి, బొగ్గురవాణాకు రెండు వ్యాగన్లు కేటాయించారు. పవర్‌ప్లాంట్ వద్ద ఇతర అన్ని పనులు పూర్తిచేయడంతోపాటు, ఉద్యోగులు, అధికారులు, కార్మికుల నివాస నిమిత్తం తుంగపాడుబంధం-కృష్ణానది సంగమం వద్ద ప్రత్యేకంగా కాలనీని భారీ టవర్లతో ఏర్పాటు చేస్తున్నారు. దామరచర్ల నుంచి పవర్‌ప్లాంట్ వరకు, అక్కడినుంచి తుంగపాడు వాగు పక్కగా నూతనంగా నిర్మించే కాలనీ వరకు ప్రత్యేక రోడ్లను సైతం వేసేందుకు నిధులు మంజూరుచేశారు. ఈ పనులన్నింటినీ వచ్చే ఏడాదిలో పూర్తిచేయాలని, 2025 మే నాటికి మొత్తం ప్లాంటు వినియోగంలోకి తెచ్చేలా పనులు చేస్తున్నారు. అయితే ఇక్కడ....

- మిగతా 6వ పేజీలో...

రూ.5వేల కోట్లతో రోడ్ల విస్తరణ



రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లాలో రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించా రు. జిల్లాలో మొత్తం సుమారు రూ.5వేల కోట్లతో రోడ్ల కు అనుమతులు మంజూరు చేశారు. జిల్లాలో ప్రతీ మండలం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్‌రోడ్డు, ప్రతీ గ్రామం నుంచి మండలం కేంద్రానికి బీటీరోడ్డును మంజూరుచేశారు. జిల్లాలోని కీలకమైన రహదారులన్నింటికీ నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. చిట్యాల-భువనగిరి రోడ్డును జాతీయరహదారిగా చేపట్టాలని కేంద్రానికి విన్నవించగా, నల్లగొండలో రింగ్‌రోడ్డుకు రూ.450కోట్లు కేటాయించారు. అదేవిధంగా రీజినల్ రింగురోడ్డు దక్షిణభాగాన్ని మంజూరు చేయించిన పనులకు శ్రీకారం చుట్టారు. కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిని ఆరులేన్లుగా విస్తరించే పనులను కేంద్రంతో మాట్లాడి మంజూరు చేయించారు. మిర్యాలగూడలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపైన నాలుగు చోట్ల అండర్‌పాస్‌వేలకు శంకుస్థాపనలు చేశారు. మొత్తంగా రోడ్ల పనులు భారీగా నిధులిస్తుండడంతో జిల్లా రోడ్లకు మహర్దశ పట్టనుంది.

నల్లగొండలో వైద్య కళాశాల ప్రారంభం

నల్లగొండ జిల్లాకేంద్రంలోని గంధంవారిగూడెం వద్ద 42 ఎకరాల్లో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనానికి 2022ఆగస్టులో శంకుస్థాపన చేసి పనులు చేపట్టగా, 2024, డిసెంబరు 7వ తేదీన ఈ భవనసముదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కళాశాల భవన సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మూడు అంతస్తులు, బాలికల వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు అయిదంతస్తులు, బాలుర వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు అయిదంతస్తులు నిర్మించారు. వీటితోపాటు ప్రిన్సిపల్ క్వార్టర్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు మూడు అంతస్తులు నిర్మించారు. క్యాంటిన్ ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. ప్రహరీ, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ప్రాంగణమంతా గ్రీనరీ, చెట్లతో కళకళలాడుతోంది. ఇదే ప్రాంగణంలో రూ.400కోట్లతో నర్సింగ్ కళాశాలకు కూడా శంకుస్థాపన చేశారు.









ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు

- ఎత్తిపోతల పథకాలన్నింటినీ ఏడాదిలో పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశాలు
- జిల్లా రోడ్లకు భారీగా నిధులు ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి



ప్రారంభోత్సవం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



కొనసాగుతున్న సుంకిశాల పనులు

(5వపేజీ తరువాయి)

భూములు, ఇళ్లు కోల్పోయిన సుమారు 558 మంది నిర్వాసితులకు ఇంకా ఉద్యోగాల కల్పన జరగలేదు.

ఎస్‌ఎల్‌బీసీ, డిండిఎత్తిపోతల పథకాలకు డెడ్‌లైన్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వరప్రదాయిని.. ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను 2027 సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. ఈ పనులకు అవసరమైన టన్నెల్‌బోరింగ్ మిషన్‌లో ఉపయోగించే బేరింగ్‌ని అమెరికానుంచి తెప్పించేందుకు ఒప్పందం చేసుకోగా, మార్చి నుంచి ఇవన్నీ అందుబాటులోకి వచ్చి పనులు మొదలవుతాయని పేర్కొంటున్నారు. ఈ పథకం పూర్తికి అవసరమైన రూ.4,460కోట్ల నిధులను కూడా ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ పథకం పూర్తయితే బ్రాహ్మణవెల్లంల కలుపుకొని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. అదేవిధంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.50 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే డిండి ఎత్తిపోతల పథకాన్ని కూడా రాబోయేమూడేళ్లలో పూర్తిచేయాలని, ఈ పథకానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లో అంతర్భాగమైన ఏదుల నుంచి నీటిని సేకరించాలని నిర్ణయించి, పనులకు టెండర్లను ఆహ్వానించారు.

ఎత్తిపోతల పథకాలన్నింటినీ ఏడాదిలో పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న చిన్ననీటి ఎత్తిపోతల పథకాలు (మినీ లిఫ్టులు) అన్నింటినీ పునరుద్ధరించడంతో పాటు, దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న లిఫ్టులను వచ్చే ఆగస్టు నాటికి పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అందుకోసం రూ.500 కోట్ల నిధులను మంజూరు చేశారు. అదేవిధంగా ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ఎదురవుతున్న లష్కర్లు, ఆపరేటర్ల సమస్యను పరిష్కరించేందుకు మంత్రి ప్రత్యేక కార్యాచరణ అమల్లోకి తెచ్చారు. లష్కర్ల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలచేశారు. లిఫ్టులను క్లస్టర్లుగా మార్చి ఆపరేటర్లు, డ్రాఫ్ట్‌మెన్‌ని నియమించాలని కమిటీలకు ఆదేశాలిచ్చారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ప్రతీ ఎకరాకు సాగునీరివ్వడమే ఏకైక లక్ష్యంగా పలు సంస్కరణలను ప్రవేశపెట్టారు. మూసీ నదిపై ఉన్న భీమలింగం కత్వ, అసిఫ్‌నహర్‌కాల్వ, ధర్మారెడ్డికాల్వ, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణకు కూడా రూ.524కోట్లు మంజూరు చేసిపనులు చేపట్టారు.

జిల్లాలో ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు

ఉపాధి కల్పనే ధ్యేయంగా ఐటీఐల స్థానంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ బాలుర ఐటీఐ, బాలికల ఐటీఐతోపాటు భువనగిరి, ఆలేరు, డిండి, హాలియా, హుజూర్‌నగర్‌లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆరు ఆధునిక కోర్సులతో ఈ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.40కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. అదేవిధంగా నల్లగొండలో సెట్విన్ సహకారంతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయగా, ప్రతీ నియోజకవర్గంలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులిచ్చారు. వీటితోపాటు స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.48కోట్లు కేటాయించారు. అదేవిధంగా నల్లగొండ, మునుగోడు, హుజూర్‌నగర్‌లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లక శంకుస్థాపనలు చేశారు.



యాదాద్రి థర్మల్ ప్లాంట్ పైలాన్

మననం 2024

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలి

గృహనిర్మాణ శాఖ ఎండీ, ఐఏఎస్ అధికారి వీపీ గౌతమ్



హుజూర్‌నగర్‌లో మోడల్ కాలనీని పరిశీలిస్తున్న వీపీ గౌతమ్

హుజూర్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సమగ్ర సర్వేను పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ఎండీ ఐఏఎస్ అధికారి వీపీ గౌతమ్ కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి మూడో వార్డు ఎన్జీవో కాలనీ, చైతన్య కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులను కసిఇ, సర్వే యాప్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యమిస్తోందన్నారు. అధికారులు త్వరగా సర్వే పూర్తి చేయాలన్నారు. సొంత స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ నాగార్జున్‌రెడ్డి, కమీషనర్ శ్రీనివాసరెడ్డి, డిపిఆర్‌ఓ రమేష్,ఈఈ దర్మారెడ్డి, కోతి సంపత్‌రెడ్డి,పాల్గొన్నారు.

రెండు నెలల్లో పూర్తి చేయాలి

రెండు నెలల్లో మోడల్ కాలనీ ఇళ్లను వేగవంతంగా పూర్తిచేయాలని వీపీ గౌతమ్ అన్నారు. పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇళ్లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. మోడల్‌కాలనీలో 2,166 ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి పనుల్లో వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి ఇళ్లను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1000ఇళ్లు, 66 బ్లాక్‌లు పూర్తిచేసినట్లు తెలిపారు. 30 బ్లాక్‌లకు స్లాబ్‌లు వేయాల్సి ఉందన్నారు. మొత్తం 130 బ్లాక్‌లు ఉన్నాయన్నారు. మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఇళ్లు పరిశీలించినట్లు తెలిపారు. కూలీలను ఎక్కువ మందిని ఏర్పాటుచేసి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జున్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీపీఆర్‌వో రమేష్, ఈ ఈ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు

- రుణాల రికవరీలో అలసత్వం తగదు
- డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



నాంపల్లిలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

నాంపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వెలుగు, జాతీయ ఉపాధిహామీ సిబ్బంది తమవిధుల్లో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు సిబ్బంది, జాతీయ ఉపాధిహామీ సిబ్బందితో విడివిడిగా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల పెంపకంపై ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కాని కొంతమంది సిబ్బంది మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఏడు గ్రామపంచాయతీల్లో మొక్కలకు కావాల్సిన మట్టిని కూడా సేకరించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాక్ లింకేజీ ద్వారా లోన్లను అందిస్తున్న మహిళలకు లోన్లు ఇప్పించడంలో, శ్రీనిధి రికవరీ చేయడంలో కూడా నాంపల్లి మండలం జిల్లాలోనే వెనుకబడి పోయిందన్నారు. ఇప్పటినుంచి ప్రతీ శనివారం గ్రామసంఘంలోని ఏదో ఒక సంఘానికి బ్యాంకు రుణాలు ఖచ్చితంగా ఇప్పించాలన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొ ని బ్యాంక్ లోన్లుశ్రీనిధి రికవరీ చేయడంలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గాలెం ఇందిర, ఏపీఎం వినోద్, ఏపీవో వెంకటేష్, సీసీలు సత్యనారాయణ, సత్యం, శ్రీశైలం, నాగమణి, సావిత్రి, వీవోఏలు పాల్గొన్నారు.

పుల్లారావుకు నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు



రామగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన డాక్టర్ పుల్లారావుకు నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు దక్కింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎమ్ఏ) ఆధ్వర్యంలో ఈ అవార్డును అందజేశారు. ఐఎమ్ఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన ఆల్ ఇండియా మెడికల్ కాన్ఫరెన్స్ నాట్కో ఉత్సవ్ నిర్వహించిన కార్యక్రమంలో పుల్లారావుకు అవార్డును అందజేశారు. పుల్లారావు చేసిన పలు సామాజిక సేవలను గుర్తించిన ఐఎమ్ఏ ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ కోల్‌కత్తా, ఢిల్లీ, తిరువనంతపురం, అహ్మదాబాద్‌వంటి ప్రాంతాల్లో జరిగిన మెడికల్ కాన్ఫరెన్స్‌లో అవార్డు తీసుకున్నట్లు తెలిపారు.ఈ ఏడాది కూడా హైదారాబాద్‌లో అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు.

విద్యా వ్యవస్థను పరిరక్షించాలి

మూఢ నమ్మకాలను పెంచే విద్యావిధానం

ప్రమాదకరం : నర్సిరెడ్డి



మత విశ్వాసాలు, మూఢనమ్మకాలను పెంచే విద్యావిధానం ప్రమాదకరమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న చరిత్ర నల్లగొండ జిల్లాకు ఉందన్నారు. మట్టి పిసికే చేతులే పోరాటాలు చేశాయని, వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళా విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దేశం ఐక్యంగా ఉండాలంటే భిన్నత్వంలో ఏకత్వంగా ఉండాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తలేదన్నారు. విద్యా విధానాన్ని కాషాయీకరణం చేయడం సరికాదన్నారు. విద్యకు బడ్జెట్‌లో కొంతమేరకు నిధులు పెంచినప్పటికీ ఇంకా పెంచాలన్నారు.

(5వపేజీ తరువాయి)

పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఉందన్నారు. టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ ఇన్‌చార్జీల పాలనలో విద్య వ్యవస్థను సరిదిద్దాలన్నారు. కొత్త ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్ల సమస్య తీర్చిందన్నారు. రాష్ట్రంలో 22జిల్లాలకు డీఈవోలు లేరని, 63మంది డిప్యూటీ డీఈవోలు లేరన్నారు. 640 మంది మండలాల్లో కేవలం మాత్రమే 14మంది రెగ్యూలర్ ఎంఈవోలు ఉన్నారన్నారు.



సమాజంలో పెరుగుతున్న అంతరాలు : కే.నాగేశ్వర్

దేశంలో పాలకులు అవలంబిస్తున్న అసంబద్ధమైన విధానాల వల్ల సమాజంలో అంతరాలు పెరుగుతున్నాయని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. దేశంలో బడా పెట్టుబడిదారుల ఆదాయాలు భారీగా పెరుగుతున్నా, వారి నుంచి తక్కువ ట్యాక్సీ వసూలు చేస్తున్నారన్నారు. మధ్య తరగతి ఉద్యోగుల నుంచి మాత్రం వసూలు చేసే పన్ను అధికంగా ఉందని, అదే సమయంలో పెట్టుబడిదారులకు అధిక పన్ను రాయితీ ఇస్తుందన్నారు. దేశంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు అయ్యే ఖర్చు కేవలం రూ.4వేల కోట్లు మాత్రమే ఉందన్నారు.





విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలి: కే.శ్రీనివాస్

విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలని 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు డాక్టర్ కే.శ్రీనివాస్ అన్నారు. మహాసభల్లో 'విద్యలో రాజ్యాంగ విలువలు' అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్ది, వారు సమాజ మార్పునకు కృషి చేసేలా తీర్చిదిద్దాలన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించి, విశ్వసించి, అనుసరించి, అమలు చేసే బాధ్యత పౌరులదేనన్నారు. చదువు సమాజ మార్పునకు ఉపయోగపడుతుందన్నారు. విద్యా రంగంతోపాటు ఉపాధ్యాయులకు అనేక సమస్యలు ఉన్నాయని, ఉపాధ్యాయులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. ప్రజల స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని, అనేక కారణాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందన్నారు. పోరాట శక్తిని కలిగి ఉండాలని, అదే మార్పును తెస్తుందన్నారు. ప్రతిఒక్కరూ మంచి సమాజం కోసం కృషి చేయాలన్నారు.

100 శాతం అక్షరాస్యత సాధించాయి

- జూలకంటి రంగారెడ్డి



ప్రపంచంలో పలు దేశాలు నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించాయని, భారత దేశంలో 67శాతం అక్షరాస్యత మాత్రమే సాధించామని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల కాలంలో రాజ్యాంగం ద్వారా ఏమి సాధించామని అనుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తి అభ్యున్నతికి, సమాజ వికాసానికి విద్య అవసరమన్నారు. ఉపాధ్యాయులు వేసే పునాది ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీష్ మాట్లాడుతూ 206 సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేశానని పెండింగ్ బిల్లు సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్, రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఏపీయూటీఎఫ్ అధ్యక్షుడు నక్క శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సంయుక్త, టాప్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, టీజీఎస్సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, నల్లగొండ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బక్క శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం, మాజీ అధ్యక్షులు ఎడ్ల సైదులు, జి.అరుణ, ఆయుష్ ఘోష్, విద్యాసాగర్ రెడ్డి, నలపరాజు వెంకన్న, బంగారయ్య, లక్ష్మారెడ్డి, రాములు, సోమ శేఖర్, రాజశేఖర్ రెడ్డి, నాగమణి, యాకయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు. అంతకు ముందు పట్టణంలో నల్లగొండ గడియారం సెంటర్ నుంచి లక్ష్మీ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

నేరాల అదుపే లక్ష్యం

- శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం
- ఈ ఏడాది జిల్లాలో 8695 కేసులు నమోదు
- కొత్త క్రిమినల్ చట్టాల కింద 2717 కేసులు నమోదు
- మిషన్ పరివర్తన్ ద్వారా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం
- వార్షిక ప్రెస్ మీట్‌లో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ జిల్లాకేంద్రంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా, నేరాల అదుపే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీలతో కలిసి వార్షిక క్రైమ్ ప్రెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జిల్లాలో జరిగిన నేరాలు, నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 2024లో మొత్తం 8,695 కేసులు నమోదయ్యాయని, ఇందులో 211 ప్రాణాంతకమైన నేరాలకు సంబంధించిన కేసులు కాగా, 8,484 సాధారణ నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల ప్రకారం 2,717 కేసులు నమోదయ్యాయన్నారు. మేజర్ క్రైమ్‌కు సంబంధించి ఐదు ఆస్తికోసం హత్యలు జరిగాయని, రెండు బందిపోటు నేరాలు, 10 దోపిడీ, 33 హత్యలు, ఐదు నరహత్యలు, 100 అత్యాచారాలు, 657 మోసాలు, 56 హత్యాయత్నం, 476 మిస్సింగ్ కేసులు, 194 బీఎన్ఎస్ఎస్(174సీఆర్‌పీసీ) కేసులు నమోదయ్యాయన్నారు.

డ్రగ్ మాఫియా నిర్మూలనకు..

డ్రగ్ మాఫియాను నిర్మూలించడానికి రాష్ట్ర పోలీసులు డ్రగ్స్‌రహిత తెలంగాణగా మార్చడానికి డ్రగ్ పెడ్లర్లపై 24 గంటలు నిఘా ఉంచడానికి డీవోపీఎమ్ఎస్ యాప్‌ను రూపొందించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది మొత్తం 34 గంజాయి కేసులు నమోదు చేసి 124 మంది నిందితులను గుర్తించామని, సుమారు రూ.2కోట్ల విలువైన 794.69 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. అదే విధంగా 108 కేసులకు సంబంధించి రూ.9.97కోట్ల విలువైన 3988 కేజీల గంజాయిని కోర్టు అనుమతితో దహనం చేశామన్నారు. మహిళలను ఇబ్బందులకు గురి చేసిన విషయంలో ఈ ఏడాది మొత్తం 655 కేసులను నమోదు చేయగా, అందులో వరకట్న వేధింపుల వల్ల మరణాలు 1, ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన కేసులు 10, వేధింపులు 292, స్త్రీల హత్యలు 8, రేప్ కేసులు 97, కిడ్నాప్ 46, వేధింపులకు సంబంధించిన కేసులు 201 ఉన్నాయన్నారు. మహిళల రక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన షీ టీమ్స్ జిల్లాలో సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. భరోసా సెంటర్ల ద్వారా మహిళలకు రక్షణ, పిల్లలపై లైంగిక దాడుల నివారణ, నిరాధారణకు గురైన వారికి అండగా ఉంటూ వారికి ఒకే చోట మెడికల్, న్యాయ సలహా, వైద్యంతోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ దేశంలోనే మొదటి సారిగా రాష్ట్రంలో పోలీస్, మహిళ, అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. 39 మంది రేప్ బాధితులు, 106 మంది పోక్సో, 35 బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులకు సంబంధించి భరోసా సెంటర్‌లో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ముగ్గురు బాధితులకు రూ.15వేల చొప్పున సహాయం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

863 రోడ్డు ప్రమాదాలు.. 373 మంది మృత్యువాత

జిల్లాలో ఈ ఏడాది సైబర్ క్రైమ్‌కు సంబంధించి 135 కేసులు నమోదు చేశామని సైబర్ మోసాలకు ప్రజలు సుమారు రూ.5కోట్లు పోగొట్టుకున్నారని, అందులో రూ.85లక్షలను రీఫండ్ చేసేలా చర్యలు తీసుకున్నామని ఎస్పీ చెప్పారు. మొత్తం 863 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, ఇందులో 373 మంది మరణించగా, 756 మంది క్షతగాత్రులయ్యారని, అదేవిధంగా ఈ ఏడాది 1,54,934 మోటార్ వెహికిల్ కేసులు నమోదు చేయగా దీనికి సంబంధించి రూ.7,87,19,550 జరిమానా విధించామన్నారు. 9840 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. గతేడాది కేవలం ఒక కేసులో మాత్రమే నేరారోపణ రాగా, ఈ ఏడాది 11 కేసులలో జీవిత ఖైదుతోపాటు జరిమానా విధించేలా కృషి చేశామన్నారు. అదే విధంగా ఈ ఏడాది సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని, ఈ ఎన్నికల్లో 308 సంఘటనల్లో రూ.4.48కోట్ల నగదు, 531 కేసులలో రూ.40లక్షల విలువైన 6,028 లిక్కర్, 35 క్వింటాళ్ల నల్ల బెల్లం, 608 కిలోల పటిక, రూ.6.50లక్షల విలువైన గంజాయి, రూ.5.73 కోట్ల విలువైన మెటల్స్ రూ.4.82 కోట్ల విలువైన ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు.

జిల్లాలో రూ.14 కోట్ల చోరీ

నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది మొత్తం 550 దొంగతనాలు జరిగాయని, ఈ చోరీల్లో సుమారు రూ. 14కోట్ల ఆస్తి చోరీకి గురైందని ఎస్పీ వివరించారు. ఇందులో రూ.5కోట్లు రికవరీ చేశామన్నారు. అదే విధంగా ఎక్సైజ్‌కు సంబంధించి 613 కేసులు, నకిలీ విత్తనాలకు సంబంధించి 2, పీడీఎస్ అక్రమ రవాణా 217 కేసులు, ఇసుక అక్రమ రవాణా 482, గుట్కా రవాణా 8, గేమింగ్ యాక్టు 60, పశువుల అక్రమ రవాణాకు సంబంధించి 28 కేసులు నమోదు చేశామన్నారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న టెక్నాలజీని ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్ల సమస్య అధికమవుతుందన్నారు. సైబర్ నేరాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు ప్రతీ జిల్లాకు డీ4సీని సైబర్ క్రైమ్ బ్యూరో అదనపు డీజీపీ శిఖా గోయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి డీఎస్పీ స్థాయి అధికారిని నియమించి ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకు, ఏటీఎం మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఛేదించిన కేసుల్లో కొన్ని..

- ఈ ఏడాది జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేధించిన పలు కేసుల్లో కొన్నింటిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరించారు. కట్టంగూర్ పీఎస్ పరిధిలోని జరిగిన ఓ దారుణ హత్య కేసులో ప్రమేయం ఉన్న భయంకరమైన పార్థీ గ్యాంగ్ కార్యకలాపాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. ఈ ముఠాను కేవలం ఆరు నెలల కాల వ్యవధిలో పట్టుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.
- దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో జీఐ వైర్, అల్యూమినియం షీట్లను చోరీ చేస్తున్న ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రూ.71లక్షల విలువైన 4జీఐ వైర్ బండిల్స్, రూ.58లక్షల నగదు, ఒక కారు, రెండు బైక్‌లు, ఒక ఆటో మొత్తం వీటి విలువ రూ.1.49 కోట్లుగా వివరించారు.
- ఐదుగురు సభ్యులతో కూడిన ముఠా డమ్మి పిస్టల్‌తో చోరీలకు పాల్పడుతుండగా, వారిని పట్టుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ముఠాను విచారించగా నల్లగొండ జిల్లాలో 28 నేరాలు, సూర్యాపేట జిల్లాలో 1 కేసు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 2 నేరాలు చేసినట్లు అంగీకరించారన్నారు.
- మిషన్ పరివర్తన్ ద్వారా 3,542 గ్రామాలను సందర్శించామని, 715 కార్యక్రమాలు నిర్వహించామని ఎస్పీ వెల్లడించారు. 21 మందిపై గంజాయి హిస్టరీ షీట్ ఓపెన్ చేశామని, 34 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.
- రోడ్డు ప్రమాదాల నివారణకు ఒక్కో అధికారి ఒక్కో డివిజన్‌లో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని ఎన్‌హెచ్‌ఏ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, ఎంవీఐ, స్థానిక నాయకులతో కలిసి హాట్‌స్పాట్‌లను సందర్శించి రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారని ఎస్పీ వివరించారు. 59బ్లాక్ స్పాట్లను ఈ ఏడాది 43కు తగ్గించామన్నారు. సెల్‌ఫోన్లు పోయిన వారు 3,614 మంది దరఖాస్తు చేస్తే 1473 సెల్‌ఫోన్లను గుర్తించి యజమానులకు అందజేశామన్నారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ ద్వారా 127 మంది చిన్నారులను రక్షించి కొంత మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా మరికొంత మందిని హాస్టళ్లు, స్కూళ్లలో చేర్పించామన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	573.10
టీఎంసీలు	264.3618
ఎడమకాల్వకు నీటి విడుదల	8193
కుడికాల్వకు	7778
విద్యుత్ కేంద్రం ద్వారా	27,846
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	7063 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	46,517 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.79 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.02 అడుగులు
టీఎంసీలు	3.94
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	96.17 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	604 క్యూసెక్కులు

70 ఎకరాల్లో జాతరకు ఏర్పాట్లు

- రైతుల నుంచి లీజుకు తీసుకోనున్న అధికారులు
- ఎకరానికి రూ.25 వేలు చెల్లించనున్న ప్రభుత్వం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా సన్నాహాలు
- 11 శాఖల సమన్వయంతో పెద్దగట్టు జాతర



పెద్దగట్టు చెరువులో నిండా ఉన్న నీరు

ఖానుపురి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండో అతిపెద్దదైన సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లిలో నిర్వహించే లింగమంతుల స్వామి జాతరకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చే స్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా రెవెన్యూ అధికారులు రైతుల నుంచి వ్యవసాయ భూములను వారం రోజుల పాటు లీజు కు తీసుకోనున్నారు. ఎకరానికి రూ.25వేల చొప్పు న 70ఎకరాల భూమిని లీజుకు తీసుకోవాలని భా విస్తున్నారు. దీనికి సంబం ధించి కలెక్టర్‌కు నివేది క అందించనున్నారు. పెద్దగట్టుకు ప్రత్యేకంగా భూములు లేవు, భూములుంటే భక్తులు ఆ ప్రాం తంలోనే వంటలు చేసుకుని మూడు రోజుల పా టు ఉండి వెళ్లేవారు. గత జాతర సందర్భంగా అధికా రులు 48ఎకరాలు లీజుకు తీసుకున్నారు. పెద్ద గట్టు పక్కన చెరువులో ప్రస్తుతం నిండా నీరు ఉండడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎక్కువ భూమిని లీజుకు తీసుకోవాలని అధికా రులు చర్యలు తీసుకుంటున్నారు.

గత జాతరకు కేటాయింపులు ఇలా..

11 శాఖల సమన్వయంతో జాతర నిర్వహించ నున్నారు. మునిసిపాలిటీ, దేవాదాయశాఖ, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ, విద్యుత్, రెవెన్యూ, డీపీఆర్వో, పోలీసులు, వైద్యఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖలు నిర్వహణ బాధ్యతలు తీసుకుంటాయి. ప్రధానంగా మునిసి పాలిటీ, దేవాదాయశాఖలు కీలకంగా పని చేయ నున్నాయి. 2023 సంవత్సరంలో జరిగిన జాత రకు ప్రభుత్వం రూ.5.10 కోట్లు కేటాయించింది. అందులో మున్సిపాలిటీకి రూ.1.70కోట్లతో గుట్ట చుట్టు పక్కల పారిశుధ్యం పేరుకుపోకుండా ఎప్ప టికప్పుడు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పంచాయతీరాజ్ శాఖకు రూ.89లక్షలు కేటాయించగా రోడ్లు, మరమ్మతులకు ఖర్చు చేశారు. మిషన్‌భగీరథ శాఖకు రూ.40లక్షలు కేటాయించగా తాగునీటి సరఫరా, ట్యాంకులు నింపడం, పైపులైన్ల మరమ్మతులు, నల్లాలను బిగించడం లాంటి పనులకు ఖర్చు చేశారు. విద్యుత్ శాఖకు రూ.40 లక్షలు కేటాయించగా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను లాగడం, మర మ్మతులు లాంటి వాటికి ఖర్చు చేశారు. రెవెన్యూ శాఖకు రూ.35.75 లక్షలు కేటాయించారు. వీఐ పీలు, సిబ్బందికి, విధులకు వచ్చిన అధికారులకు భోజనాలకు కేటాయించారు. రైతుల భూములకు ఒక్కొక్క ఎకరానికి రూ.25వేల చొప్పున కేటాయిం చారు. ప్రజా సంబంధాల శాఖకు(డీపీఆర్వో) రూ.12.15లక్షలు కేటాయించారు. పాత్రికేయులకు భోజనాలు, జాతరలో ప్రత్యేక పాసులు ఏర్పాట్లు, వీఐపీలు వచ్చినప్పుడు కవరేజీకి కేటాయించారు. పోలీసులు శాఖ కు రూ.25 లక్షలు కేటాయిం చారు. జాతర విధుల కు వచ్చిన పోలీసులకు భోజనాలకు ఖర్చు చేశా రు. వైద్యఆరోగ్యశాఖకు రూ.9 లక్షలు ఖర్చుచేశా రు. భక్తులకు ప్రమా దాలు జరిగితే వైద్యసేవలు, మందుల కొనుగోళ్లకు కేటాయించారు. అగ్నిమాప క శాఖ రూ2.30ల క్షలు కేటాయించారు. అగ్ని ప్ర మాదం జరిగితే అక్కడికి వెళ్లి మంటలు ఆర్పాల్సి ఉంటుంది. మత్స్యశాఖకు రూ.1.50 లక్షలు కేటాయించారు. గుట్టచుట్టూ ఉన్న బావుల్లో భక్తులు జారి పడితే రక్షించడానికి గజ ఈతగాళ్లను ఏర్పా టు చేసి నట్లు అధికారులు చెబుతున్నారు. దేవాదాయశా ఖకు రూ.84 లక్షలు కేటాయించినట్లు రికా ర్డుల్లో ఉంది. దేవాలయం ఉన్న ప్రాం తంలో ఉన్న కట్టడాలు నిర్మించడం, కార్మికులను పెట్టడం, వీఐపీ దర్శ నాలకు, కేసారం నుంచి సౌడమ్మ పెట్టను తీసుకురావడం, తీసుకె ళ్లడం, గుట్టపై ఇతర కార్యక్రమాలను చేపట్టడా నికి ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

అవకతవకలకు తావుండదు



ఎలాంటి అవకతవకలకు తావు ఉండదు. ఎవరి శాఖ కు వారే బాధ్యులు. వారు ఇచ్చిన సమాచారాన్ని మునిసి పాలిటీలో భద్రపరుస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు నిధుల కేటాయింపు ఉం టుంది. పనుల నిర్వహణకు టెండర్లు పిలుస్తాం.

- శ్రీనివాసరావు, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్



పెద్దగట్టు కింది భాగంలో కృత్రిమ కోనేరు

జాతర ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి గ్రామం 2018 లో సూర్యాపేట పట్టణంలో విలీనమైంది. అప్పటి వర కు దురాజ్‌పల్లి గ్రామపంచాయతీ, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో లింగమంతులస్వామి జాతర నిర్వహించే వారు. సూర్యాపేట పట్టణంలో విలీనమైన తర్వాత 2021, 2023లలో మునిసిపాలిటీ, దేవాదాయశాఖల ఆధ్వర్యంలో జాతరను నిర్వహించాయి. జరగనుంది. 2025 సంవత్సరంలో(ఫిబ్రవరిలో) మూడోసారి నిర్వ హించే జాతరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిధులు కేటాయించడా నికి వివిధ శాఖల ను ంచి ప్రతిపాదనలు పం పించాలని చెప్పడంతో ఇప్పటికే కొన్ని శాఖల అధికారులు కలెక్టర్ ఛాంబ ర్‌కు వివరాలు అందజేశారు. కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను పంపిన తర్వాత నిధులు మంజూరు అవుతాయని అధికారులు చెబుతున్నారు.

38 మంది రైతుల నుంచి భూమి లీజుకు

పెద్ద గట్టు జాతరకు గుట్ట చుట్టూ 38మంది రైతుల వ్యవసాయ భూముల ను సుమారు 70ఎకరాలవరకు సేకరించనున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 58 ఎకరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఒక్కో ఎకరానికి రూ.25వేల చొప్పున లీజు ఇవ్వడానికి రైతులను నుంచి వివ రాలు సైతం సేకరించారు. 2022-23 సంవత్సరంలో నిర్వ హించిన జాతరలో 48.20 ఎకరాల భూములు లీజుకు సేకరించారు. పెద్దగట్టుకు పక్కన ఉన్న చెరువులో నీరునిండా ఉంది. జాతరకు వచ్చే భక్తులకు నీటికొరత తగ్గించేందుకు ఉపయో గపడనుంది.

మద్యం బెల్టు దుకాణాలు మూసివేయించాలి

శాలిలింగోటం గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం



శాలిలింగోటం గ్రామంలో మద్యం బెల్ట్ దుకాణాలు మూసివేయించాలని పంచాయతీ కార్యదర్శి వేమారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

శాలిగౌరారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాలతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని, తక్షణం వాటిని మూసివేయాలని శాలిలిం గోటం గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శనివారం ఈ మేరకు గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం శాలిలింగోటంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన సమాచారం మే రకు వివరాలిలా ఉన్నాయి. 325 ఇళ్లు, 1300 మంది జనాభా ఉన్న శాలిలింగోటం గ్రామంలో ఆరు మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 4గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు వీటిని నిర్వహిస్తుండటంతో మద్యం మత్తులో ఇంటికి వచ్చి మహిళలను దుర్భాషలాడుతూ, వేధిస్తూ, కొడుతూ, మాన సిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు మద్యం మత్తులో వీధుల్లో తిరుగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, మహిళలను కించప రిచే విధంగా మాట్లాడుతున్నారని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యా నికి బానిసై కొన్ని కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా చిన్నాభిన్నమై గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామపెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు శనివారం సమావేశమై మద్యం బెల్టు దుకాణాలు మూసి వేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి వేమారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఇంకా కోలుకోని కలుషిత కల్లు బాధితులు

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో ఈనెల 25న ఆరుగురు వ్యక్తులు కలుషిత కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం పాఠకులకు విదితమే. నకిరేకల్ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కన్నెబోయిన నరేష్ 26న కోలు కుని డిశ్చార్జి కాగా, అదే ఆస్పత్రిలో వల్లపు లింగయ్య, గంట రామచంద్రయ్యలు చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి కొంచెం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. నల్ల గొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మేడిపల్లి బిక్షం ఇంకా చికిత్స పొందుతున్నాడు. చావు బతుకుల మధ్యలో ఉన్న పాక పిచ్చయ్య, దుబ్బాక అచ్చయ్యలు హైద రా బాద్‌లోని వేర్వేరు ఆస్పత్రులకు తరలించగా వారు ఇంకా కోలుకోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వీరు ఎమర్జెన్సీ వార్డులోల్లో చికిత్స పొందుతున్నారు.

ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి

● నార్కట్‌పల్లి కామినేని కళాశాల సదస్సులో వైద్య నిపుణులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేగంగా మారుతున్న ఆరోగ్య సమస్యలు, పెరుగుతున్న జనాభా వృద్ధి దీర్ఘకాలిక వ్యాధుల భారాన్ని ఎదుర్కొనేందుకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావా లని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. వృ ద్ధాప్య మహిళల ఆరో గ్యంపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని వైద్య విద్యా కళా శాలలో శనివారం సదస్సులో నిర్వహించారు. వృద్ధాప్య దశలో ఉన్న మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్యపరమైన సమస్యలు, అధునాతన వైద్య పరీక్షలు, చికిత్సలు ఆహార పోషణ, సామాజిక, మానసిక ఆరో గ్యంపై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాబా సాహెబ్ కుడగి సారథ్యంలో జరిగిన సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400మంది వైద్యులు, 500మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఆర్‌కు చెందిన న్యూట్రిషన్ శాస్త్రవేత్తలు, ప్రసూతి, స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు, కిమ్స్ డైరెక్టర్ ఎం.ఈ లూథర్, పీవీ రామమోహన్, మారుతి శర్మ, సురేంద్రబాబు, రత్న బాలరాజు, యామిని, నాగమల్లేశ్వర్‌రావు, నాగేశ్, ఫణీంద్ర, ఓంప్రకా శ్, పరశురాం, సైదులు, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చ కులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువు లను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమం త్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళా లతో అర్చించారు. ప్రాకార మండపంలో సుద ర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశా స్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేది కపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవా హన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యా ణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం వేళ ప్రధానా లయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాత గుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. శివాల యంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండ పంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్ర హవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.



ధనుర్మాస పర్వాల్లో భాగంగా మంగళహారతులు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పక్షిని ఆవహించిన భ కాసురుడిని శ్రీకృష్ణుడు, రావణుడిని సంహరించిన శ్రీరాముడి నామ స్మరణతో శ్రీరంగనాథున్ని ఆరాధిస్తూ గోదాదేవి తిరుప్పావై వ్రతంలో పదమూడో పాశురాన్ని భక్తులు పఠించారు. తెల్లవారుజామున జరిగి న వేడుకల్లో మహిళ భక్తులు హారతి నివేదించగా పొంగలి ప్రసాదా న్ని వితరణ చేశారు. కొండపైన నిర్వహించే సంగీత సభల్లో భాగం గా కళారాధన మ్యూజిక్, డాన్స్ అకాడమీ (విశాఖకు చెందిన టి.సం దీప్‌కుమార్) కూచిపూడి నృత్యం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న అదనపు డీజీపీ

లక్ష్మీనృసింహుడిని అదనపు డీజీపీ వి.వి శ్రీనివాసరావు, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ఎం దోబ్రియల్ కుటుంబ సమే తంగా దర్శించుకున్నారు. వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో ఏ. భాస్కర్‌రావు వారికి లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

గుండాల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని గుండాల- రామారం గ్రామాల మధ్యన శనివారం సాయంత్రం ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామారం గ్రామానికి చెందిన మెంటె యాదయ్య (65) జ్వరం రావడంతో గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తిరిగి వచ్చి బస్టాప్ వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో మండలంలోని వస్తాకొండూరు గ్రామానికి చెందిన బి.పురుషోత్తం మద్యం మత్తులో ఆటో నడుతపుతూ కూలీలను తీసుకుని రావడానికి రామారం వైపు వెళుతుండగా అదే ఆటోలో యాదయ్య ఎక్కాడు. గుండాల- రామారం మధ్య ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. యాదయ్యకు తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్థులు 108కు సమాచారం అందించగా జనగాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యాదయ్య మృతి చెందాడు. ఆటో డ్రైవర్ పురుషోత్తం, మరో ప్రయాణికునికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈమేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..

చింతపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తతో లారీ యువ కుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని మధనాపురం హైవే సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌కు చెందిన కారు ఓనరైన నక్కా రాజు వనం కార్తికేయ(17) నల్లా వినయ్‌కుమార్, ఏ.చరణ్, ఎస్.దీపక్‌లను తన కారు హైదరాబాద్ నుంచి వైజాగ్ కాలనీకి తీసుకెళ్లాడు. నలు గురు స్నేహితులు కలిసి బీచ్ అందాలను చూసి తిరుగు పయనమయ్యారు. కారులో వైజాగ్ కాలనీ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా మండలంలోని మధనాపురం రాగానే పెట్రోల్ లేకపోవడంతో కారు ఆగిపోయింది. కారులో ఉన్న కార్తికేయ, చరణ్, దీపక్ రోడ్డు పక్కకు నిలిపేందుకు కారును వెనుక నుంచి నెడుతున్నారు. ఈ క్రమంలో కొండమల్లేపల్లికి చెందిన దుంప రాములు తన లారీలో మల్లేపల్లి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. మధనాపురం గ్రామశివారులో ఆగిపోయిన కారును ముగ్గురు యువకులను లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కార్తికేయ తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చరణ్, దీపక్‌లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్నేహితుడు చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఢీసీఎం ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలు

నార్కట్‌పల్లి : ఢీసీఎం ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయా లయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. అక్కెనపల్లికి చెందిన దైద పరమేశ్, నల్ల నరేశ్ అనే ఇద్దరు మిత్రులు వ్యవసాయ బావి వద్ద పొలం పనులు చూసుకుని ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు ఎక్కుతుండగా నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలుకు వైపునకు అతివేగంగా వెళుతున్న ఢీసీఎం ఢీ కొట్టింది. దీంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరినీ అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుప త్రికి తరలించారు. కాగా వీరిలో పరమేశ్ తలకు బలమైన గాయాలవడంతో పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఇంకా ఫిర్యాదు అందలేదు.

వివాహిత బలవన్మరణం

నార్కట్‌పల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక ఉరి వేసు కుని వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్క ట్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లికి చెందిన ఎస్ మహ్మద్ తన కూతురు రేష్మాను నార్కట్‌పల్లి కే చెందిన సైకిల్ మెకాని క్‌గా పనిచేసే గౌస్‌కు ఇచ్చి పదిహేనేళ్ల క్రితమే వివాహం చేశారు. రేష్మా, గౌస్ దంప తులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా రేష్మా స్థానిక హెరిటేజ్ పాల కంపె నీలో వర్కర్‌గా పనిచేస్తోంది. కొంత కాలంగా రేష్మా గౌస్‌ల మధ్య గొడవలు జరుగు తున్నాయి. పెద్ద మనుషులు అనేకసార్లు సర్ది చెప్పారు. భర్త వేధింపులు భరించలేక రేష్మ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై కప్పునకు ఉన్న ఐరన్ రాడ్‌కు ఉరివేసుకుంది. మృతురాలి తండ్రి ఎస్‌కే మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

పరుగుల రాణి అఖిల

- అథ్లెటిక్స్‌లో డిండి నుంచి అంతర్జాతీయ స్థాయికి
- తాష్కెంట్‌లో ప్రతిభ కనబరిచిన అఖిల
- ఉడిపిలో రికార్డు సృష్టించి.. బంగారు పతకం కైవసం
- జాతీయ స్థాయిలో రాణిస్తున్న అఖిల



సాధారణ కుటుంబం..తండ్రి తాపీ మేస్త్రీ, తల్లి శ్రామిక మహిళ..చదివింది నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకు ల పాఠశాల. పువ్వు పుట్టగానే పరిమళిస్తుం ది అనడానికి అఖిల ఓ ఉదాహరణ. పాఠశాల స్థాయిలో అఖిల ప్రతిభను కనిపెట్టిన ఉపాధ్యాయుడు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడంతో ఆమె పరుగుల రాణి గా ప్రతిభ కనబరుస్తోంది. గెలుపు పొందే వరకు అలుపు లేకుండా ఆమె పయనం సాగుతోం ది. తాష్కెంట్‌లో జరి గిన పోటీల్లో రాష్ట్రం నుంచి అఖిల మాత్రమే ఎంపికైంది. కర్నాటక రాష్ట్రం లోని ఉడిపిలో పరుగుపందెంలో మెరుపు వేగంతో బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు రికా ర్డును నెలకొల్పింది.

డిండి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతానికి చెందిన బాలికను అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తగిన తర్ఫీదు, ప్రోత్సాహం కల్పించి వెన్నుతట్టింది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల. లక్ష్యంపై గురి, పరుగులో మెరుపువేగం ఆ బాలిక నైజం. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన అవుట చెన్నయ్య ఎల్లమ్మ దంపతుల రెండో కుమార్తె అఖిల జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లె టిక్స్ మీట్‌లలో పతకాలు సాధించి తన సత్తా చాటు తోంది. డిండి మండల కేంద్రానికి చెందిన అవుట అఖిల తండ్రి చెన్నయ్య తాపీ మేస్త్రీగా పనిచేస్తుండగా తల్లి ఎల్లమ్మ కూలీ పనులకు వెళుతోంది. చెన్నయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా కుమార్తె అవుట అఖిల 2016-17 విద్యా సంవత్సరంలో డిండి మండల కేంద్రం లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాలలో చేరింది. ప్రతిరోజు విద్యార్థులతో ఆడించే ఆటల్లో అఖిల చురుకుదనం, పరుగులో మెరుపు వేగాన్ని గుర్తించి కోచ్ పరశురాం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కోచ్ పర్యవేక్షణలో అఖిల క్రీడా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచు కుంది. డిండి మండల కేంద్రంలోని సాంఘిక గురుకుల పాఠశాల క్రీడా అకాడమీలో పొందిన శిక్షణ అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొని పతకాలు సాధిం చేందుకు దోహదపడింది. అకాడమీలో 2వేలమీటర్లు, 1500 మీటర్లు, 1000 మీటర్లు పరుగుపందెం అథ్లెటి క్స్‌లో పాల్గొనేందుకు శిక్షణ పొంది పతకాలు సాధి స్తుంది. 2023 ఏప్రిల్ 27 నుంచి 30వరకు తాష్కెంట్ లోని ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన 5వ ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆడే అవకాశం తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక అఖిలకు మాత్రమే దక్కింది. ఇక్కడ నిర్వహించిన అండర్ 18 విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెం అథ్లెటిక్స్‌లో 6వ స్థానంలో నిలిచింది. 2023 మార్చి 10, 12 తేదిలలో కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో జరిగిన 18వ నేషనల్ యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ అండర్ 18 విభా గంలో 1500 మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థా నంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుంది. తన ముందున్న 1500 మీటర్ల లక్ష్యాన్ని అఖిల 4.45 సెక న్లలో చేరుకుని గతంలో ఉన్న 4.59 సెకన్ల రికార్డును అధిగమించి అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. 2023 అక్టోబరు 15, 16, 17తేదీల్లో వరంగ ల్‌లో జరిగిన 34వ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థా నంలో నిలిచి బంగారు పతకం సాధించింది. 2022 సెప్టెంబరు 9, 10, 11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగిన 33వ సౌత్‌జోన్ నేషనల్ అథ్లె టిక్స్ చాంపియన్‌షిప్ 2వేల మీటర్ల పరుగుపందెంలో 3వ స్థానం దక్కించుకుని కాంస్యపతకం గెలుచు కుంది. మిడ్లేరిలేలో 3వ స్థానం సాధించి కాంస్య పతకం పొందింది. అంతర్జాతీయ స్థాయిలో భారతదే శానికి పతకం సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు అవుట అఖిల తెలిపింది.

ఖో-ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు





లెంకల మనశ్వినికూకుట్ల సిరి చందన (ఫైల్)

తుర్కపల్లి: జిల్లా స్థాయి సీఎం కప్ ఖో-ఖో పోటీల్లో యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని రామాపురం మోడల్ స్కూల్ వి ద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన లెంకల మనశ్విని, కూకుట్ల సిరి చందన వరంగల్‌లో ఈ నెల 29 నుంచి 2025 జనవరి 2వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీ లలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్స్ పాల్ శోభారాణి, పీడీ రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సీఎం కప్ కబడ్డీ, ఖోఖో పోటీలకు 'రాంపురం' విద్యార్థులు

తుర్కపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలలో మండలం లోని రామాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీ లకు ఎంపికయ్యారు. పాఠశాల నుంచి ఆకుల పూ జ, ఎయ్యేముల అంజలి, దాసారం రాధిక, బానావ తు నితిన్ ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ శోభా రాణి, ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు.



సీఎం కప్ కబడ్డీ జట్టుకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

తరలింపు హామీ ఏమైంది?



- చెత్త నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనతో ఇబ్బందులు
- అనారోగ్యానికి గురవుతున్న పరిసరాల ప్రజలు
- తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారీతో ప్రయోజనం



నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్న మునిసిపాలిటీ ఆ చెత్తను నల్లగొండ మండల సమీపంలోని చందనపల్లి గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తుంది. ఇంటింటికీ చెత్తను సేకరించడం వల్ల పట్టణంలో వార్డులో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుంటుంది. అయితే ప్రధాన సమస్య నల్లగొండ సమీపంలో డంపింగ్‌యార్డులో చెత్త వేయడం వల్ల ఆ పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీసారి ఎన్నికల సమయంలో ఆ డంపింగ్ యార్డును దూర ప్రాంతాలకు తరలిస్తామని నాయకులు హామీ ఇస్తున్నా అందుకు సంబంధించి భూమిని సేకరించడంలో ఆలస్యం జరుగుతోంది. దీంతో చందనపల్లి గ్రామంలో ఉన్న యార్డులో నిత్యం చెత్త నుంచి విడుదలవుతున్న పొగతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్తనుండి వెలువడుతున్న పొగ వల్ల ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. అదేవిధంగా ఆస్తమా ఉన్న ప్రజలకు ముఖ్యంగా చిన్నారులకు, వృద్ధులకు ఈ పొగ వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. నల్లగొండ నుంచి ఉదయసముద్రం నుంచి నకిరేకల్ వెళ్లే రహదారిపై చెత్త డంపింగ్ యార్డు పరిసరాల్లో వెలువడుతున్న పొగ, మంచు పొగను తలపిస్తుంది. ఒక్కోసారి ఆ పొగతో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రతీరోజూ 96 టన్నుల చెత్త

నల్లగొండ పట్టణంలోని 48 వార్డుల నుంచి మునిసిపాలిటీ సిబ్బంది నిరంతరం ట్రాక్టర్లు, ఆటో ట్రాలీ వాహనాల ద్వారా చెత్తను సేకరిస్తారు. ప్రజల్లో కూడా చైతన్యంరావడంతో తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి ఇస్తున్నారు. అయితే ఇంకా కొన్నిచోట్ల ప్రజలు బుట్టల్లో వేయకుండా పక్క ప్లాట్లల్లో, తమ సమీప ప్రాంతాల్లో వేయడం వల్ల కూడా చెత్త పేరుకుపోతుంది. కొన్నిసార్లు మునిసిపల్ సిబ్బంది ఆలస్యమైతే ఆ చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతుంది. ఇక 48 వార్డుల నుంచి ప్రతీరోజు సేకరిస్తున్న 96 టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇందులో 3 టన్నులు తడి చెత్త ఉంటుం ది. ఈ తడి చెత్తను 30 నుంచి 40 రోజుల పాటు డీ కంపోస్టు చేస్తారు. ఈ డీకంపోస్టులో వానపాములను వేయడం వల్ల వర్మి కంపోస్టు తయారవుతుంది. ఇక పొడి చెత్తలో ఉండే అట్టలు, ప్లాస్టిక్ బాటిళ్లు, సీసాలు, ఇంకా ఇతర వస్తువులను వేరుచేసి విక్రయించడానికి మునిపిపాలిటీ ఒక ఏజెన్సీకి అప్పగించింది. ఆ ఏజెన్సీ మునిసిపాలిటీకి నెలకు రూ.25వేల చొప్పున చెల్లిస్తారు. ఇంకా వర్మి కంపోస్టును కిలోకు రూ.10 చొప్పున వెచ్చించి రైతులు కొనుగోలు చేస్తారు. 2014 సంవత్సరంలో ఈ వర్మి కంపోస్టు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చెత్త డంపింగ్ యార్డు సుదూర ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంత ప్రజలు రోగాల బారి నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయి.

డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి



చందనపల్లి గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి. వ్యర్థాలతో దోమలు, ఈగలు, కుక్కలు, పందులతో సమస్యలు ఏర్పడుతున్నాయి. పానగల్ ఉదయ సముద్రంలో ముంపునకు గురైన ప్రాంతం చందనపల్లిలో ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు. పట్టణంలోని చెత్తను అంతా డంపింగ్ యార్డులో పోయడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. జిల్లా ప్రజలకు తాగునీరు అందించే ఉదయ సముద్రం చెరువు చెత్తాచెదారం, కళేబరాలతో కలుషితం అవుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డును తొలగించాలి.

- సురిగి రమేష్ గౌడ్, చందనపల్లి

తడి చెత్తతో వర్మి కంపోస్టును తయారు చేస్తున్నాం

ప్రతీరోజు నల్లగొండ పట్ట ణం నుంచి వస్తున్న చెత్తను తడి చెత్త వేరుగా, పొడి చెత్తను వేరుగా చేస్తున్నాం. ఆటో ట్రాలీ, ట్రాక్టర్లు రోజు రెండు ట్రిప్పుల చొప్పున 200 ట్రిప్పుల వరకు 96 టన్నుల మేర చెత్తను యార్డుకు తీసుకువస్తాయి. తడి చెత్తతో వర్మి కంపోస్టును తయారు చేస్తున్నాం. వర్మి కంపోస్టు ఒక కిలోకు రూ.10లకు విక్రయిస్తున్నాం.

- శశిధర్, డంపింగ్ యార్డు ఇన్‌చార్జి

పట్టా రద్దు చేయాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో సర్వే నెంబర్ 410లో గూడూరు మమతారెడ్డి పేరిట ఉన్న భూమి పట్టాను రద్దు చేయాలని కోరుతూ భూమిపై కబ్జాలో ఉన్న గ్రామస్థులు శనివారం తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 410లో మొత్తం 9 ఎకరాలు ఉండగా సదరు పట్టాదారుకు ఏకంగా 4 ఎకరాల ప్ర భుత్వ భూమి సంక్రమించిందో రెవెన్యూ అధికారులు విచారణ చేసి రద్దు చేయాలని కోరారు. సదరు సర్వే నెంబర్ భూమిపై కబ్జాలో ఉన్న కొందరికి పట్టాలు ఉండగా కొందరికి పట్టాలు లేకున్నా వ్యవసాయ సంబంధిత నిర్మాణాలతో సంవత్సరాలుగా ఉంటున్నట్లు తెలిపారు. అది తమ భూమి అంటూ ఒక వ్యక్తి వచ్చి పోలీసుల సాయంతో స్వాధీనపరుచుకునే ప్రయత్నం చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో తాడోజు శ్రీనివాస్‌చారి, బొడ్డుపల్లి చిన ఇస్తారి, బీ.లింగయ్య, రాచకొండ శంకర్, అంతటి సతీశ్, తాడోజు నరేంద్రచారి, కొర్వి శంకర్, పరమేశ్వరి, సీతమ్మ, మల్లిఖార్జున్, జగదీశ్‌చారి ఉన్నారు.

కేసులను సామరస్యంగా పరిష్కరించాలి

● నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసులను సామరస్యంగా పరిష్కరించి ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా పని చేయాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి సూచించారు. నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది కవాతును పరిశీలించి స్టేషన్ పరిసరాలు, రైటర్ గది, సీసీ టీవీల పనితీరు, కోర్టు రికార్డులకు సంబంధించిన రూంను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ శివరాంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని, పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచేలా సిబ్బంది పనితీరు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రావుల నాగరాజు, ఎస్ఐలు గాజుల మానస, జయాకర్, ఏఎస్ఐ ఖయ్యుముద్దీన్, ఉమారాణి, సిబ్బంది నర్సింహారావు, బ్రహ్మచారి, పాయిలి రాజు, రామలింగయ్య, దార లింగస్వామి, బాలకోటి, శంకర్, మహేష్, నాగరాజు, పాష, శివశంకర్, స్వామి, శ్రీను పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను చిట్యాలలో ఏర్పాటు చేయాలి'

చిట్యాల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గానికి కేటాయించిన ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను చిట్యాల మండల పరిధిలో ఏర్పాటు చేయాలని స్వేరోస్ రాష్ట్ర నాయకుడు రుద్రవరం సునీల్‌కుమార్ కోరారు. చిట్యాలలో శనివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో చిట్యాల మినహా మిగతా అన్ని మండలాల్లో గురుకుల పాఠశాలలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ సాధనకు రాజకీయాలకతీతంగా అందరూ కలిసి రావాలనీ కోరారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పోకల దేవదాస్, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పొన్నం లక్ష్మయ్య, మేడి శంకర్, దేశపాక రాజేష్, శేఖర్, చిన్నస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి

కనగల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, సమాజ ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో పద్మ కోరారు. కనగల్ గ్రామంలోని స్ఫూర్తి స్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఎంఈవో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నక్కల రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లకు అండగా ప్రభుత్వం



కేకును కట్ చేస్తున్న పాస్టర్లు, అధికారులు

నాంపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రిస్టియన్లు అండగా ఉంటుందని తహసీల్దార్ దేవసింగ్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం మండలంలోని క్రైస్తవులకు ప్రేమవిందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అనివార్య కారణాల వల్ల ఈ విందు కార్యక్రమం ఆలస్యమైందన్నారు. అనంత రం కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరి స్వర్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కుంభం కృష్ణారెడ్డి, పాస్టర్లు సల్మాన్, అనన్యపాల్‌రాజ్, సల్మాన్‌రాజ్, హెజ్ర, పేతురు, గిరిప్రసాద్, మార్క్, డేవిడ్, ఎలియా, షైమా పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలి

మర్రిగూడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని, అప్పుడే చదివినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బెంగూళూర్‌కు చెందిన చైల్డ్ రైతు అండ్ యో పార్టు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'పూరి పడాయి దేశ్‌కీ బడాయి' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ముందుకొచ్చినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి, డీటీ తారక్‌రామన్, ఆర్ఐ శ్రీనివాస్, పోరాట సమితి సభ్యులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పుల్లెంల గ్రామస్థులు

చండూరు రూరల్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): చండూరు మండలం పుల్లెంల గ్రామానికి ప్రత్యేక ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆ గ్రామస్థులతో కలిసి ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ మాజీ సర్పంచ్ బొబ్బల మురళీమనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పుల్లెంల, ఇడికూడ గ్రామ పంచాయతీలను కలిపి ఒక ఎంపీటీసీగా ఏర్పాటు చేశారని, గతంలో తక్కువ ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీలను ఒకటి చేసి ఒకే ఎంపీటీసీగా చేశారని తెలిపారు. కానీ ప్రస్తుతం పుల్లెంల గ్రామంలో 2447 ఓటర్లు ఉన్నారని, కాబట్టి పుల్లెంల గ్రామానికి ఒకే ఎంపీటీసీ పరిధిగా ఏర్పాటు చేమాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, కర్నాటి శివకుమార్, శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నల్లగొండ ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన టోకెన్ సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ నాయకుడు ధనంజయ

నల్లగొండరూరల్, తిప్పర్తి, కట్టంగూరు, చిట్యాల, మునుగోడు, చండూరురూరల్, నార్కట్‌పల్లి, మర్రిగూడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లాలోని పలు మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో వారి కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, అర్హత కలిగిన కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు.

● ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రీన్ చానల్ ద్వారా గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇరిగి ఎల్లేష్, నాయకులు సైదులు, రేణుక, బోగరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంచర్ల జానయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బీమగాని గణేష్, కార్మికులు షైనం మల్లయ్య, సైదులు, భిక్షం, చంద్రయ్య, రాజు, యాదయ్య, నరసింహ పాల్గొన్నారు.

● కట్టంగూరులో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు పొన్న అంజయ్య, నర్సింగ్ శ్రీను, వినోద్, వెంకటయ్య, రామలింగయ్య, జానయ్య, వినోద, యాదమ్మ, రేణుక, పరమేష్ పాల్గొన్నారు.

● చిట్యాలలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ మాట్లాడుతూ వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అవిశెట్టి శంకరయ్య, బొబ్బల సుధాకర్ రెడ్డి, గ్యార మారయ్య, మహేష్, బాలమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

● మునుగోడులో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని. కార్యక్రమంలో నాయకులు లింగయ్య, పెద్దమ్మ, ఎర్ర అరుణ, యాదయ్య, మోహన్, అండాలు, సుజాత, పార్వతమ్మ, శాంతి, చంద్రమ్మ పాల్గొన్నారు.

● చండూరులో ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు నర్సింహకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల సైదులు, నాయకులు నాంపల్లి శంకర్, పుష్పలత, ముంత వెంకటేశ్వర్లు, వెంకటాచారి, కృష్ణయ్య, బిక్షమయ్య, మహేందర్, నగేష్, కలమ్మ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో జీపీ కార్మికుల సమ్మె రెండోరోజూ కొనసాగింది. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతపల్లి బయ్యన్న, చెరుకు పెద్దులు, దండు రవి, ఎల్లయ్య, కల్లూరి యాదగిరి, శ్రవణ్, జీపీ కార్మిక సంఘం నాయకులు మాదగోని సైదులు, దండు నాగరాజు, కృష్ణ, యాదయ్య, శంకరమ్మ, ఎల్లమ్మ, యశోద, ఈదమ్మ, రమణ, రజిత పాల్గొన్నారు.

● మర్రిగూడలో తెలంగాణ రాష్ట్ర చేతి వృత్తుల సంఘం ఉపాధ్యక్షుడు సలవోజు రామలింగాచారి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల డిమాండ్లను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాయకులు ఉరిపక్క లింగయ్య, పోతరాజు కృష్ణయ్య, లచ్చయ్య, అమృత, సుజాత, మంజుల, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి: సమ్మెలో పాల్గొన్న మండల గ్రామ పంచాయతీ కార్మికులు

నీలగిరిలో రూ.230 కోట్లతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రమేష్

● మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో సుమారు రూ.230 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టణ అభివృద్ధి లక్ష్యంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నూతనంగా వచ్చిన 41 మంది వార్డు ఆఫీసర్లలో 20 మంది మాత్రమే జాయిన్ అయ్యారని పేర్కొన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లి రామరాజు మాట్లాడుతూ పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, విలీన వార్డుల్లో గతంలో ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు కూడా అలానే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ ఖయ్యూం బేగ్ మాట్లాడుతూ పట్టణంలో దాదాపు సగం ఇళ్లకు మాత్రమే నల్లా కలెక్షన్లు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని చూపిస్తూ దొంగ కలెక్షన్ల యజమానులకు నోటీసులు ఇవ్వాలని అన్నారు. తద్వారా మునిసిపాలిటీకి ఎంతో ఆదాయం చేకూరుతుందని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాములు, ఏసీపీ కుద్దూస్, డీఈలు, ఏఈలు, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న కౌన్సిల్ సమావేశ మందిరాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణంపై పలు సలహాలు సూచనలు చేశారు. నాణ్యతలో తేడా వస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కౌన్సిలర్లు, ఇంతియాజ్, ప్రదీప్‌నాయక్, నాయకులు సమ్మద్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలి



ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, రామగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరిస్తే ముక్తి మార్గం లభిస్తుందని టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధం ప్రాజెక్టు పరిశీలకుడు ఆచార్య వింజమూరు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు చంద్రగిరి విలాస్ కాలనీలో గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ధనుర్మాసంలో భక్తులు విష్ణు సహస్రనామాలతో పాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తే మంచి జరుగుతుందన్నారు. మంచి అలవాట్లతోనే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. తిరుప్పావై ప్రవచకుడు ముడుంబై పవన్‌కుమార్, అర్చకులు వేదాంత నర్సింహాచార్యులు, చక్రీ, కాలనీ అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలి

● వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నల్లగొండ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య అన్నారు. పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులందరికీ సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని, ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో మీడియాలో వస్తున్న విషయాలపై కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. లబ్ధిదారుల ఎంపికపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు, అనంద్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారీ ఐలయ్య

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విరాళం

నకిరేకల్, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): విద్యారుల్లో ప్రతిభావంతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యాదగిరి గౌడ్ విరాళం అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య తెలిపారు. శనివారం ఆయ న విలేకరులతో మాట్లాడారు.

కళాశాల టాపర్‌కు ప్రతి ఏటా స్వర్ణపతకం అందించేందుకు పోలీస్‌శాఖ ఏసీబీలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చౌగోని యాదగిరి గౌడ్ తన కుమారుడు శ్యాంప్రసాద్ జ్ఞాపకార్థం రూ.1.25 లక్షల నగదు కళాశాలకు అందజేసినట్లు తెలిపారు. నగదును కళాశాలలో శాశ్వత డి పాజిట్‌గా ఉంచి దీనిపై వచ్చే వడ్డీతో ప్రతీ సంవత్సరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నకిరేకల్ టాపర్‌కు శ్యాంప్రసాద్ గౌడ్ పేరుపై బంగారు పతకం అందజేస్తామని తెలిపారు. స్వర్ణపతక దాత యాదగిరిగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత విద్య, వైద్యం ఉపాధి కల్పించాలి

శాలిగౌరారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అన్ని పార్టీల వారు తమ మేనిఫెస్టోలో పేదలకు కనీస వసతులు కల్పిస్తామని ప్రకటించిన వాటిని అమలుచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకు ఉచిత సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం వల్ల వారు శారీరక శ్రమకు దూరమై సోమరులుగా మారుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత సంక్షేమ పథకాలు బంద్ చేసి, ప్రభుత్వం ఉచిత వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే వారికి న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రకంగా ఆలోచన చేసి పేద ప్రజలను ఆదుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు టెండర్ కం వేలం

కనగల్, డిసెంబరు 28: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏడాది కాలానికి కొబ్బరికాయలు అమ్ముకొనే హక్కుల కోసం ఈ నెల 30వ తేదీన టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జయరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాట నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎండోమెంట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం ఈవో పేరిట డీడీ తీసి కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

ఫిబ్రవరి 12లోపు ఫీజు చెల్లించాలి

నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని వార్షిక, సెమిస్టర్ విధానంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు ఫిబ్రవరి 12వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సీఈవో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2011- 2016, 2016 - 2020 విద్యా సంవత్సరం లో సీబీసీఎస్ విధానంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని బీఏ, బీకాం, బీఎస్సీ బీబీఏ కోర్సుల విద్యార్థులు ఒక్కొక్క సబ్జెక్టు రూ.1000 చొప్పున చెల్లించి పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీలగిరి కవుల చరిత్ర ఆవిష్కరణ

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నీలగిరి చరిత్ర పుస్తకాన్ని హైదరాబాద్ పుస్తక మహోత్సవం దాశరథి ప్రాంగణం డాక్టర్ బోయ విజయభారతి వేదికపై శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత పున్నం అంజయ్య రచించిన నీలగిరి కవుల చరిత్ర రెండు భాగాలు పుస్తకాన్ని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఆదివారం నల్లగొండ క్లబ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకన్న, గోనారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నల్లగొండ క్లబ్‌లో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో పట్టణానికి చెందిన కె.సుధాకర్‌రెడ్డి 100వ సారి రక్తదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అన్నారు. ఆసక్తి గల వారు కూడా రక్తదానం చేసి రోగులను కాపాడాలని కోరారు. సుధాకర్ 100వ సారి రక్తదానం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రహరీకి శంకుస్థాపన

చండూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చండూరు రైతు సేవా సహకార సంఘం ఆవరణలో రూ.13లక్షలతో చేపడుతున్న కార్యాలయ ప్రహరీ నిర్మాణానికి సంఘం పీఏసీఎస్ చైర్మన్ కోడి సుష్మ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండమల్ల శ్రీనివాసులు, డైరెక్టర్లు కట్ట బిక్షం, మిట్టపల్లి రాజు, చెరుపల్లి ఆంజనేయులు, కొత్తపాటి సతీష్, గిరి సత్తయ్య, శ్రీనివాసులు, దశరథ, పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	225
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 19.2

విద్యా వ్యవస్థను పరిరక్షించాలి



నల్లగొండ జిల్లాకేంద్రంలో యూటీఎఫ్ మహాసభలలో మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ జిల్లాకేంద్రంలో యూటీఎఫ్ మహాసభలలో పాల్గొన్న టీచర్లు

నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను పరిరక్షించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆరో విద్యా వైజ్ఞానిక మూడు రోజుల మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్య ఉన్న చోటే అభివృద్ధి ఉంటుందని, ఒక కుటుంబంలో ఒక్కరు విద్యావంతులైతే ఆ కుటుంబ సభ్యులందరూ అభివృద్ధి చెందుతారన్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 18.5లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, అనేక కారణాలతో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయన్నా రు. పారిశుధ్య కార్మికులు, కాపలాదారులు లేక ఇబ్బందికరమైన పరిస్థితుల్లో పాఠశాలలు ఉండేవని, ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను నియమించిందన్నారు. నూతన డీఎస్సీ ద్వారా 10 వేలకు పైగా కొత్త ఉపాధ్యాయులు వచ్చారని, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లలో మరో 10వేల మంది నియమితులయ్యారన్నారు. పదోన్నతులు, బదిలీల సమస్య కాంగ్రెస్ హయాంలోనే పరిష్కారమైందన్నారు. 317జీవోలో సమస్యలున్నాయని, డిసెంబరు 31లోపు స్పౌజ్ సమస్యలను... - మిగతా 6వ పేజీలో...



విద్యార్థులను గొప్ప పౌరులుగా

తీర్చిదిద్దాలి: కే.శ్రీనివాస్

- మూఢ నమ్మకాలను పెంచే విద్యా విధానం ప్రమాదకరం
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- సమాజంలో పెరుగుతున్న అంతరాలు : కే.నాగేశ్వర్
- నల్లగొండలో ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆరో మహాసభలు

పారిశుధ్యం, తాగునీటిపై

పర్యవేక్షించాలి

- కలెక్టర్ ఇలాత్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్యం, తాగునీటిపైన మండల పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పారిశుధ్యం, తాగునీటి అంశాలపై ఎంపీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీరోజు శానిటేషన్, తాగునీటిపై పర్యవేక్షణచేసి ఇబ్బందులు ఉంటే, వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎంపీవోలు విధులకు గైర్హాజరు కావొద్దన్నారు. జనవరి 15లోగా గ్రామపంచాయతీల్లో పన్ను వసూళ్ల పూర్తి చేయాలని, డిసెంబరు 31 నాటికి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పంచాయతీ కార్యదర్శులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మురళీ, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి

నల్లగొండ రూరల్: పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించింది. కలెక్టరేట్‌లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా ఉండాలని, ఈ విషయంలో తహసీల్దార్లదే కీలక పాత్ర అన్నారు. ఇళ్లకు విద్యుత్, తాగునీరు, రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ తిరుపతయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ

పట్టాలు అందజేస్తాం

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

23 వేల ఎకరాలకు సర్వే పూర్తయింది : అదనపు కలెక్టర్ శ్రీనివాస్



అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి

నాగార్జునసాగర్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పట్టాలు అందజేస్తామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తిరుమలగిరి(సాగర్) మండలంలో అటవీ, రెవెన్యూ, ఎంపీ ల్యాండ్స్ సర్వే పూర్తయిందన్నారు. త్వరలో సీఎం ద్వారా అర్హులకు పట్టాలు అందజేస్తామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 23వేల ఎకరాలకు సర్వే పూర్తయిందన్నారు. అందులో సేద్యం చేస్తూ పట్టాలు లేని 7,400 ఎకరాలకు రైతులు అర్హులను గుర్తించి కబ్జాలు ఉన్నవారికే పట్టాలిస్తామన్నారు. పాస్ బుక్ ఉండి, భూమి మీద ఉండి ధరణిలో లేకుండా ఉన్నవారి వివరాలను ధరణిలో చేర్పుతామన్నారు. అలాగే భూమి మీద ఉండి, పాస్ బుక్ లేకుండా ఉన్న బీపీఎల్ కుటుంబాలకు అసైన్డ్ భూమి పట్టాలను అందజేస్తామన్నారు. అటవీ భూములను సాగు చేస్తున్న రైతుల భూములకు ఎలా పట్టాలివ్వాలి, ఆర్వోఆర్ఎఫ్ఆర్ ఎలా చేయాలో సమీక్షలో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎఫ్‌వో రాజశేఖర్, ఎఫ్‌డీవో సంగీత, తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ అనిల్, రాంబాబు, పగడాల నాగరాజు పాల్గొన్నారు.

మననం 2024

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు

గడచిపోతున్న 2024 సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొత్త అభివృద్ధికి పునాదులు పడ్డాయి. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేలా ఇరిగేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మరోవైపు మౌలిక వసరుల కల్పనా రంగానికి శ్రీకారం చుట్టింది. జిల్లాకు చెందిన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ఈ ఏడాదంతా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారంచుట్టారు. ప్రధానంగా ఎస్ఎల్‌బీసీ పూర్తికి కార్యాచరణ ప్రకటించగా, డిండి లిఫ్టు, మూసీ కాల్వలకు భారీగా నిధులు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో సీఎంఇచ్చిన హామీ మేరకు మూసీ ప్రక్షాళ న ప్రాజెక్టును చేపట్టారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల నుంచి నీటివిడుదల

- నెరవేరిన బ్రాహ్మణవెల్లెంల కల, రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసిన సీఎం రేవంత్, మంత్రి వెంకటరెడ్డి
- వెలుగు జిలుగుల యాదాద్రి ప్రారంభం
- నల్లగొండలో మెడికల్ కళాశాల ప్రారంభం, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన
- ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల పథకాలకు డెడ్‌లైన్లు



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు

జిల్లాలోని నకిరేకల్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు సాగునీరిచ్చే ఉదయసముద్రం, బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం కల ఈ ఏడాదిలో సాకారమైంది. ఈ ప్రాజెక్టు పైలాన్‌ని సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్ ఏడో తేదీన ఆవిష్కరించారు. పైలాన్ ఆవిష్కరణతోపాటు బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసిన సీఎం అక్కడ గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఫ్లోరోసిస్‌తో బాధపడే తన సొంత గ్రామంతోపాటు మూడు నియోజకవర్గాల్లోని ప్రజల ఇక్కట్లు తీర్చేందుకు 2007లో అప్పటి ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏఎమ్మార్పీ ద్వారా బ్రాహ్మణవెల్లంలకు నీటిని తీసుకొచ్చి ఇక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి తద్వారా ఇక్కడి నుంచి లక్ష ఎకరాలకు నీరివ్వాలనే పథకానికి రూపకల్పన చేశారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి ఈ పథకానికి రూ.699కోట్ల నిధులు మంజూరు చేయించడమేకాక అప్పటి సీఎం వైఎస్ఆర్‌తో శంకుస్థాపన చేయించారు. 2013 వరకు పనులు వేగంగా సాగినా పథకం పూర్తికాలేదు. అనంతరం గత పదేళ్లలో ఈ పథకం ముందుకు సాగలేదు. గత ఎన్నికలకు ముందు పంపుహౌస్, లిఫ్టుల పనులు పూర్తిచేసి ట్రయల్‌రన్ నిర్వహించినా, రిజర్వాయర్, కాల్వల పనులు అలాగే ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఈ పథకానికి రూ.100కోట్లు కేటాయించి పెండింగ్ పనులు పూర్తిచేయించి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. లక్ష ఎకరాలకు నిర్దేశించిన బ్రాహ్మణవెల్లంల, ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కింద మొదటి దశలో 48,972 ఎకరాలకు ఈ ఏడాది నీరిచ్చేందుకు నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ పనులను నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల్లో చేపట్టారు. కాల్వల తవ్వకాల పనులు వేగంగా సాగుతున్నాయి.

యాదాద్రి థర్మల్‌పవర్ స్టేషన్ జాతికి అంకితం

నాలుగువేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తోన్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో విద్యుదుత్పాదన ప్రక్రియని ఈ డిసెంబరు ఏడో తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వైటీపీఎస్‌లో తొలిదశలో 800 మెగావాట్ల యూనిట్-2నుంచి విద్యుదుత్పాదన మొదలైంది. మొత్తం అయిదు యూనిట్లుగా చేపట్టిన యాదాద్రి పవర్‌ప్లాంటులో డిసెంబర్‌లో యూనిట్-2 విద్యుదుత్పాదన మొదలవగా, యూనిట్-1 కూడా విద్యుదుత్పాదనకు సిద్ధమైంది. మిగిలిన మూడు యూనిట్లు కూడా దాదాపు 85శాతం పనులు పూర్తయ్యాయి. 8.8 కిలోమీటర్ల రైల్వేలైన్ కూడా ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే ట్రాక్ పర్మిషన్ మంజూరుచేసి, బొగ్గురవాణాకు రెండు వ్యాగన్లు కేటాయించారు. పవర్‌ప్లాంట్ వద్ద ఇతర అన్ని పనులు పూర్తిచేయడంతోపాటు, ఉద్యోగులు, అధికారులు, కార్మికుల నివాస నిమిత్తం తుంగపాడుబంధం-కృష్ణానది సంగమం వద్ద ప్రత్యేకంగా కాలనీని భారీ టవర్లతో ఏర్పాటు చేస్తున్నారు. దామరచర్ల నుంచి పవర్‌ప్లాంట్ వరకు, అక్కడినుంచి తుంగపాడు వాగు పక్కగా నూతనంగా నిర్మించే కాలనీ వరకు ప్రత్యేక రోడ్లను సైతం వేసేందుకు నిధులు మంజూరుచేశారు. ఈ పనులన్నింటినీ వచ్చే ఏడాదిలో పూర్తిచేయాలని, 2025 మే నాటికి మొత్తం ప్లాంటు వినియోగంలోకి తెచ్చేలా పనులు చేస్తున్నారు. అయితే ఇక్కడ.... - మిగతా 6వ పేజీలో...

రూ.5వేల కోట్లతో రోడ్ల విస్తరణ



రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లాలో రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించా రు. జిల్లాలో మొత్తం సుమారు రూ.5వేల కోట్లతో రోడ్ల కు అనుమతులు మంజూరు చేశారు. జిల్లాలో ప్రతీ మండలం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్‌రోడ్డు, ప్రతీ గ్రామం నుంచి మండలం కేంద్రానికి బీటీరోడ్డును మంజూరుచేశారు. జిల్లాలోని కీలకమైన రహదారులన్నింటికీ నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. చిట్యాల-భువనగిరి రోడ్డును జాతీయరహదారిగా చేపట్టాలని కేంద్రానికి విన్నవించగా, నల్లగొండలో రింగ్‌రోడ్డుకు రూ.450కోట్లు కేటాయించారు. అదేవిధంగా రీజినల్ రింగురోడ్డు దక్షిణబాగాన్ని మంజూరు చేయించిన పనులకు శ్రీకారం చుట్టారు. కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిని ఆరులేన్లుగా విస్తరించే పనులను కేంద్రంతో మాట్లాడి మంజూరు చేయించారు. మిర్యాలగూడలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి పైన నాలుగు చోట్ల అండర్‌పాస్‌వేలకు శంకుస్థాపనలు చేశారు. మొత్తంగా రోడ్ల పనులు భారీగా నిధులిస్తుండడంతో జిల్లా రోడ్లకు మహర్దశ పట్టనుంది.

నల్లగొండలో వైద్య కళాశాల ప్రారంభం

నల్లగొండ జిల్లాకేంద్రంలోని గంధంవారిగూడెం వద్ద 42 ఎకరాల్లో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనానికి 2022ఆగస్టులో శంకుస్థాపన చేసి పనులు చేపట్టగా, 2024, డిసెంబరు 7వ తేదీన ఈ భవనసముదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కళాశాల భవన సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మూడు అంతస్తులు, బాలికల వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు అయిదంతస్తులు, బాలుర వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు అయిదంతస్తులు నిర్మించారు. వీటితోపాటు ప్రిన్సిపల్ క్వార్టర్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు మూడు అంతస్తులు నిర్మించారు. క్యాంటిన్ ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. ప్రహరీ, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ప్రాంగణమంతా గ్రీనరీ, చెట్లతో కళకళలాడుతోంది. ఇదే ప్రాంగణంలో రూ.400కోట్లతో నర్సింగ్ కళాశాలకు కూడా శంకుస్థాపన చేశారు.




విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీవో సరిత

కేజీబీవీని తనిఖీ చేసిన జీసీడీవో

గుర్రంపోడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో సరిత తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్‌రూం, తరగతి గదులను పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలని బోధనేతర సిబ్బందికి సూచించారు.

ఆర్థికసాయం అందజేత

కొండమల్లేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన జొరిగల ఆంజనేయులు భార్య పుష్పలత కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో కెఎంపీ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యులు శనివారం రూ.15వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఏరుకొండ రాము, కూర భానుచందర్, విప్పలపల్లి జితేందర్‌యాదవ్, అలుగుబెల్లి నాగార్జునరెడ్డి, అలుగుల సాల్‌రెడ్డి, కొండమీది అంజయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి, రవికుమార్, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పదేళ్లుగా పూర్తి కాని పంచాయతీ భవనం

▸▸ పశువుల ఆస్పత్రిలో కార్యాలయ నిర్వహణ ▸▸ నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం ▸▸ ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు


నిలిచిపోయిన భవన నిర్మాణం, పశువుల ఆస్పత్రిలో గ్రామ పంచాయతీ



నిడమనూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి మొర పెట్టుకుంటారు. కానీ ఇక్కడ గ్రామ పంచాయతీ కార్యాలయమే ఓ సమస్యగా మారింది. నిడమనూరు మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేనందున స్థానిక పశువుల ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పదేళ్లుగా భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో పశువుల ఆస్పత్రిలో చిన్న ఇరుకు గదుల్లో నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం సర్పంచ్, సిబ్బంది, కార్యదర్శులు కూడా కూర్చునేందుకు సరైన స్థలం లేదు. 14 మంది వార్డు సభ్యులు ఉన్న మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో పాలకవర్గం సమావేశం నిర్వహించే పరిస్థితి కూడా లేదు. ఇక గ్రామసభ నిర్వహించాల్సి వస్తే అంతే సంగతులు. నిడమనూరు గ్రామ పంచాయతీకి గతంలో సొంత భవనం ఉండేది. భవనం పాతది కావడంతో పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వం 2014లో రూ. 16 లక్షల ఈజీఎస్ నిధులు కేటాయించింది. నిర్మాణానికి నిధులు సరిపోలేదని, బిల్లులు రాలేదని నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేయడంతో పదేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. ఇంకా తమకు రూ. 3లక్షల బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అదనపు నిధులు కేటాయించాలని గ్రామస్థులు మొర పెట్టుకున్నా నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. నిర్మాణం పూర్తి కాకపోవడంతో భవనంలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. దీంతో గతి లేక పక్కనే ఉన్న పశువుల ఆస్పత్రిలోని స్టోర్ రూముల్లో పంచాయతీ కార్యాలయం విధులు నిర్వహిస్తున్నారు. దీంతో విధుల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకే ఆవరణలో రెండు కార్యాలయాలు నిర్వహిస్తుండటంతో ఉభయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్టోర్ రూములు లేక తమకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నందున పంచాయతీ కార్యాలయానికి నిర్వహిస్తున్న గదులను అప్పగించాలని పశువుల ఆస్పత్రి అధికారులు సైతం కోరుతున్నారు. కానీ నిధులు లేకపోవడంతో పంచాయతీ భవన నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తక్షణమే అదనపు నిధులు కేటాయించి పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి సొంత భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



నిడమనూరు మండల కేంద్రంలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించాలి. గతంలో కేటాయించిన రూ.16 లక్షల ఈజీఎస్ నిధులు సరిపోకపోవడంతో నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణం వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

- నల్లమోతు వెంకటేశ్వర్లు, నిడమనూరు.

ప్రతిపాదనలు పంపాం



నిడమనూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమే. నిలిచిపోయిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు అదనపు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. మండలంలోని మిగతా పంచాయతీల భవనాల నిర్మాణం కోసం కూడా ప్రతిపాదనలు పంపాము.

- గుర్రం వెంకటేశం, ఎంపీడీవో.

పబ్లిక్ డిమాండ్


చెట్టుకు వేలాడుతున్న విద్యుత్ మీటర్

చెట్టుకు వేలాడుతున్న విద్యుత్ మీటర్

కొండమల్లేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని పాత ఊరిలో ప్రజలకు నీటి అవసరాలు తీర్చడం కోసం బోరు వేశారు. బోరుకు సంబంధించిన విద్యుత్ మీటర్, స్టార్టర్ బాక్స్ రెండు కలిపి పక్కనే ఉన్న చెట్టుకు తాడుతో అమర్చివెళ్లారు. నెల రోజుల క్రితం గాలి దుమారం రావడంతో మీటరు కోసం కట్టిన తాడు తెగింది. దీంతో చెట్టుకు వేలాడుతుంది. కాలనీకి చెందిన చిన్న పిల్లలు ఇక్కడే ఆడుకుంటూ ఉంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి మీటర్‌ను బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలి


మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

వేములపల్లి, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): సాగర్ ఎడమకాల్వపై గల ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్-14 ఎత్తిపోతల పథకాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత ప్రభుత్వం తీసుకోకపోవడంతో వాటిలో ఏర్పడే మరమ్మతుల కారణంగా రైతులపై భారం పడి ఆర్థికం గా నష్టపోతున్నారని అన్నారు. ఎత్తిపోతల నిర్వహణ బాధ్యతలను ఒక శాఖ కిందకాకుండా ఐడీసీ, ఎన్ఎస్పీ, ఐబీ అనే శాఖలకు కేటాయించడంతో వాటి మీద వారికి సరైన అవగాహన లేక మరమ్మతులకు నిధులు కేటాయించడంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎత్తిపోతల నిర్వహణను తీసుకొని లిఫ్టుల నిర్వహణకు అవసరమైన నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిఫ్టు చైర్మన్ చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, పుట్టల సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, షరీఫ్, రామకృష్ణారెడ్డి, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, బసవయ్య పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మిర్యాలగూడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఊరుబండి శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 రోజులుగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. 19,360 మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు పర్మినెంట్ చేయాలని ధర్నాలు చేపట్టారని, వారి న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. కేజీబీవీల్లో తక్కువ వేతనానికి పని చేస్తున్నారని అన్నారు. సమాన పనికి సమాన జీతం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకలు బంటు వెంకటేశ్వర్లు, గంట రాంబాబు యాదవ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసలు కావొద్దు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేములపల్లి, డిసెంబరు 28(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు గంజాయి, మద్యం వంటి వాటికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పలువురు యువకులు విద్యార్థి దశ నుంచే గంజాయి, డ్రగ్స్ వంటి వాటి బారిన పడి వాటికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక మరికొందరు సెల్‌ఫోన్లకు అలవాటు పడి సైబర్ ఉచ్చులో చిక్కుకొని ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులనూ కూడా చైతన్యవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణయ్య, సిబ్బంది ప్రేమ్‌సింగ్, ప్రసాద్, వెంకన్న, ప్రకాష్, జాఫర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిపోయిన హైవే సూచిక బోర్డు

● తప్పిన పెను ప్రమాదం

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అద్దంకి- నార్కట్‌పల్లి హైవే సూచిక బోర్డు ప్రమాదవశాత్తు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు నిర్మాణ సమయంలో అద్దంకి వైపు వెళ్లే వాహనదారుల సమాచారం నిమిత్తం ఏర్పాటు చేసిన భారీ బోర్డు శిథిలావస్థకు చేరింది. అయితే మట్టి లోడుతో పట్టణంలోని ప్రవేశిస్తున్న ఓ టిప్పర్ బోర్డుకు రాసుకోవడంతో అప్పటికే శిథిలావస్థకు చేరిన బోర్డు ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా కూప్పకూలింది. ఈ సమయంలో హైవేపై వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రోడ్డుపై సూచికబోర్డు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను దారి మళ్లించారు. భారీ క్రేయిన్ సహాయంలో రోడ్డుపై పడిపోయిన సూచికబోర్డును పోలీసులు తొలగించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.


అద్దంకి- నార్కట్‌పల్లి హైవేపై పడిపోయిన సూచిక బోర్డు

మహోన్నత ప్రధాని మన్మోహన్‌సింగ్


మన్మోహన్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, నాయకులు

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మహోన్నత వ్యక్తిత్వం కలవారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం ఎన్నెస్పీ గ్రౌండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వంద అడుగుల జాతీయ పతాకం దిమ్మె వద్ద మాజీ ప్రధాని మన్మోహన్ ఫ్లెక్సీకి పుష్పాలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణకు ఆత్మబంధువు అని కొనియాడారు. ఆయన ఎంతో ముందుచూపుతో దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేశాయని అన్నా రు. దేశ ప్రజలు ఆయనకు ఎంతో రుణపడి ఉన్నారని పేర్కొన్నారు. ఆయన మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, చిలుకూరి బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, గాయం ఉపేందర్‌రెడ్డి, కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత, మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు గౌరు శ్రీనివాస్, రేపాల మధుసూదన్, సిక్కుల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

దేశం గొప్ప ఆర్థిక, రాజకీయవేత్తను కోల్పోయింది

దేవరకొండ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక, రాజకీయవేత్తను కోల్పోయిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవరకొండలో బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన మంత్రిగా ఉపాధిహామీ, సమాచారహక్కు, ఆహారభద్రత చట్టాలను అమలు చేసిన ఘనత మన్మోహన్‌సింగ్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరచారి, అంకం చంద్రమౌళి, కృష్ణమాచారి, నర్సింహ, శేఖర్, వెంకటయ్య పాల్గొన్నారు.

భూఆక్రమణలు, అక్రమనిర్మాణాలపై కఠినచర్యలు

● సబ్ కలెక్టర్ నారాయణ అమిత్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్

మిర్యాలగూడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూఆక్రమణలు, అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణఅమిత్ స్పష్టం చేశారు. శనివారం మునిసిపాలిటీ అనుమతులు లేకుండా ప్రధాన రహదారి సాగర్‌రోడ్డులో నిర్మించిన అక్రమ కట్టడాలను టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. అనంతరం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగర్‌రోడ్డులో మునిసిపాలిటీ అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం చేపట్టడమే కాకుండా ట్రేడ్ లైసెన్స్ పొందకుండా పెద్దఎత్తున చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ విషయమై రెండు నెలల క్రితం మునిసిపాలిటీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేశారని తెలిపారు. ఈ నెల 18వ తేదీన మరోసారి నోటీసులు జారీ చేసినా సంబంధిత వ్యక్తులు స్పందించలేదని తెలిపారు. మునిసిపల్ చట్టం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న అక్రమ దుకాణాన్ని తొలగించినట్లు పేర్కొన్నారు. నిర్మాణాలు చేపట్టే ముందు ఇంటి యజమాని మునిసిపాలిటీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడితే సహించేది లేదని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ యూసూఫ్, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి : డీఈవో


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

నిడమనూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకొని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, స్టోర్ రూమును పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, వంట మనుషులకు పలు సూచనలు చేశారు. 9, 10 తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి, పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఇష్టంతో చదివి లక్ష్యాలను సాధించాలని ఆయన బాలికలకు సూచించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య నందించేందుకు ఉపాధ్యాయులు దోహదం చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల గురించి సలహాలు, సూచనలు అందించారు. బాలికలకు కచ్చితంగా నూతన మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. భోజనం నాణ్యతను కూడా పరిశీలించి, బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో లావూరి వెంకన్న, ఎస్‌వో పద్మారాణి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

జీపీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

దేవరకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేలు కనీసం వేతనం అందజేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. దేవరకొం డ ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు శనివారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందజేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, మల్లయ్య, లక్ష్మి, బయన్న, పార్వతమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

పెద్దవూర, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కర్నాటి సీతారాంరెడ్డి సతీమణి అనసూయమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విష యం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి శనివారం గ్రామానికి చేరుకొని అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియాజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్యయాదవ్, వినోద్, రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, మేకల అనిల్, కోటి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

చింతపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుగుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రజలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీచర్ రజిత, హెల్పర్ ప ద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ పాస్ విధానంలోనే ఎరువులు విక్రయించాలి


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పి.శ్రావణ్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఎరువులను ఈ పాస్ విధానంలోనే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రావణ్‌కుమార్ ఎరువుల దుకాణాల డీలర్లకు సూచించారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు లో ఉన్న ఎరువుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు ఫర్టిలైజర్ అమ్మకాలు కచ్చితంగా ఈ పాస్ ద్వారానే చేయాలని సూచించారు. రైతులకు అమ్మిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని అన్నారు. జిల్లాలోని 33 మండలాల్లో ప్రతీ మండలానికి 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఫీల్డ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇంకా 20వేల మెట్రిక్ టన్నుల యూరియా మిర్యాలగూడ గోదాంలో నిల్వ ఉన్నట్లు ఆయన వెల్లడించారు. యూరియా కోసం రైతులు మండల ఏవోలను సంప్రదించాలని ఆయన కోరారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించవద్దని, లేకుంటే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఏవో పాండు ఉన్నారు.

సర్వే చేసిన భూములకు పట్టాలు ఇవ్వాలి


మాజీ మంత్రి జానారెడ్డిని కలిసిన గిరిజన రైతులు

నాగార్జునసాగర్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): సాగులో ఉన్న తమ భూములను సర్వే చేసి పట్టాలు అందించాలని పలువురు తండాల రైతులు కోరారు. శనివారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ధరణి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఐదు నెలలుగా మండలంలోని అటవీ, రెవెన్యూ, ఈపీ ల్యాండ్స్‌ను రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అందులో మండల పరిధిలోని పిల్లిగుండ్ల తండా, తునికినూతుల, నాగార్జునపేట తదితర తండాల్లో సాగులో ఉన్న రైతుల భూములు ఇంకా సర్వే చేయలేదని, సర్వే పూర్తి చేసి తమకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు స్పందించిన మాజీ మంత్రి జానారెడ్డి అన్ని భూములను సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యలపై పోరాడిన కమ్యూనిస్టులు

డిండి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సంస్కరణలు, పేదలకు ఇళ్ల స్థలాలు, పారిశ్రామికరణ అభివృద్ధి, వ్యవసాయం తదితర అంశాలపై సీపీఐ పోరాటాలు నిర్వహించదన్నారు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కూడా సీపీఐ ముఖ్యభూమిక పోషించిందని గుర్తు చేశారు. నల్లగొండ పట్టణంలో ని ఎన్‌జీ కళాశాలలో 30వ తేదీన జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, తూం బుచ్చిరెడ్డి, మైనుద్దీన్, ఎస్ఆర్.కనకాచారి, బిక్షైలేష్, టి.విజేందర్‌రెడ్డి, బొడ్డుపల్లి రవీందర్‌శర్మ, వెంకటయ్య, కేశవులు, వెంకటేశ్వర్లు, హుస్సేన్, శీనయ్య పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

చింతపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని గొడుకొండ్ల మాజీ సర్పంచ్ అంగిరేకుల విజయగోవర్ధన్ అన్నారు. మండలంలోని గొడుకొండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు పడకంటి శివ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఇడుకుళ్ల సుచిత్ర రాంమోహన్, కడారి జంగయ్య, ముడిగ మల్లేష్, బాదేపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాగార్జునసాగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన వినయ్, భరత్, నిమ్మిలు కలిసి ఏర్పాటు చేసిన వీబీఎన్ ఫౌండేషన్ గురించి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వివరించారు. ఈ ఫౌండేషన్ ద్వారా అందజేస్తున్న సేవల గురించి తమ మిత్రులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిస్టర్ లలిత, శ్యాల, క్లారా, సుందరి, జాస్మిన్, మదీన, నాటి విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు